# కోతి

రైలు యింకా రాలేదు. ఆకాశం ముసురేసేట్లుగా వున్నది. రివ్వమని గాలి వుండి వుండి వీస్తూంటే స్టేషనులోని చెట్లన్నీ దేన్నో చూసి జడుసుకుంటున్నట్లుగా కంపించి 'జుయ్' మంటే 'జుయ్'మని గోలచేశాయి.

దుమ్ము రెండుమూడు నిలువులయెత్తున లేచి సుళ్లుగా తిరుగుతోంది.

చినుకు యింకా భూమ్మీద పడలేదు. పడకుండానే రైలువచ్చి ప్లాటుఫారంమీద నిల్చుంది.

స్టేషనులోకి త్రోసుకుంటూ వచ్చిన శాస్త్రి, కొంచెం చిరాగ్గా ముఖాన విసురుతూన్నట్లున్న దుమ్ముకు చేయి అడ్డుగా పెట్టి, అప్పటికప్పుడు ఏర్పడ్డ ఆ తోడత్రొక్కిడిలో పరుగెత్తుతూ, ఇటూ-అటూ తిరిగి మొత్తానికి ఆడవాళ్ళ పెట్లన్నీ గాలించేశాడు.

తనకు కావలసిన మనిషి రాలేదు.

బెల్లం చుట్టూ చీమలు ముసిరినట్లుగా ప్రయాణీకులు రైలును చుట్టుముట్టి సామానులు తోచినట్లుగా లోపలకు విసరటంవల్ల నేమి, దిగే జనాభా యొక్క కుయ్యో మొర్రోలవల్ల నేమీ, యావత్తు ప్లాటుఫారమూ మహా గందరగోళంగా వుంది. ఆ గొడవలోనుంచి యీవలకు వచ్చాక చినుకులు పడుతున్నట్లుగా తోచి మూసిన గొడుగును విప్పాడు శాస్త్రి.

అతను చిన్నప్పట్నుంచీ దేనికోసమో ఎదురుచూస్తున్నట్లుండేవాడు. ఆ ఎదురుచూడ్డం సెలయేటి కెరటాల తరగల పొంగుల్లో పడి పొర్లిపోదామనీ కాదు, నీలిరంగు మబ్బుల్లోకి నిండుగా హృదయాన్ని విసిరి రోజాపువ్వుల గుత్తులలోకి ముఖాన్ని దాచుకుందామనీ కాదు, మల్లెలు సన్నజాజుల వాసనలకు మత్తిల్లి ఆదర్శశిఖరాల అంచుల్లో వూహాలకు మాత్రమే అప్సరసతో సుఖిద్దామనీ కాదు—ముంగిసలా కాలం మెలితిరిగిన తన జీవితసర్పాన్ని రాచిరాచి నేలను వొత్తి కొరుకుతూన్న కొద్దీ—ఒక చల్లని చూపు ఒక

తియ్యనిమాట వినాలని కోరేది మనస్సు. అంతే! అంతకన్నా పెద్దఆశ పెట్టుకోలేదు. అతని వివాహంకూడా అంతంతమాత్రంగానే జరిగింది. శిథిలావస్థలో వున్న జీర్ణగేహాన్ని ఏదో నాలుగు తాళపత్రాలతో కప్పుకుని అందులో సుఖిద్దామనుకున్నాడు గాని అంతస్థులు మిద్దెలు విలాసాలకోసం అతను అర్రులు చాచలేదని ముందటే చెప్పాలి. డబ్బుకోసం పెళ్ళిచేసుకోటం సుతరామూ శాస్త్రికి అప్పట్లో యిష్టంలేదు. పిల్లనచ్చటం, మనస్సు కలిసిందా లేదా—యివి అన్నీ వున్నవాళ్ళకు గాని తనకేమిటి అనిపించింది. తను విరహావ్యథలు అభినయిస్తూ ఇంట్లో కూర్చుంటే తనమీద పంచప్రాణాలు పెట్టుకున్న తల్లిదండ్రు లేమికాను? అందుచేతే ఎవరో ఒకర్తి ఆడది—అని చేసేసుకున్నాడు సరస్వతిని. అనుకున్న కండిషను ప్రకారం డబ్బుయిచ్చి చదువు చెప్పించాడు మామగారు. సరస్వతి కాపురానికి వచ్చాక క్రొత్తలో కొంత పెట్టుబడికూడా తనేమీ కోరకుండానే సర్దుబాటు చేయటం జరిగింది.

ఇప్పుడు శాస్త్రి సంపాదనాపరుడు కాగానే సరస్వతి కంఠాన్ని పొడిగించి—ఆ యావత్తు ఆర్జనా నిజంగా అనుభవించవలసిన హక్కు తనది గాని అంతర బొంతరవాళ్ళను తెచ్చి మేపటం సమంజసం కాదని వాదిస్తూ వచ్చేది.

మొదట్లో శాస్త్రి సరస్వతిని చూచినప్పుడల్లా కొద్దిగా గర్వపడేవాడు లోపల్లోపల. ఆమె గుండ్రటి లేతచేతులు, రోజారంగు చెక్కిళ్లు నవ్వినప్పుడల్లా సొట్టలుపడే బుగ్గలు, మధ్యపాపిటి, వొత్తైన నొక్కునొక్కులజుట్టు జడతో ఎంతో ఆకర్షణీయంగా వుండేది. తరువాత పిల్లలు వాళ్ళతో ఆఫీసునుంచి రాగానే ఆడుకోవటంలో ఎంతో హాయి, సుఖమూ లభించేవి.

ఆ పొంగుల్లో తనకు తెలియకుండానే సరస్వతి సంసారక్రమాన్ని క్రొత్తమార్పులతో సవరణలతో ఎన్నిమాట్లు బిగించాలని ప్రయత్నించినా అదొక తమాషాగానే చూసీ చూడనట్లు వూరుకున్నాడు గాని, ఆమెలో అవ్యక్తభావనారూపమై నెలకొన్న అధికారవాంఛా మేఘు మొకనాడు ఝుళిపించి విస్సురుగా యెడాపెడా వర్షిస్తుందనీ, ఆ తుఫానులో ఇక తన ఒక్కగాని ఒక్క చెల్లాయిని రక్షించుకోనన్నా రక్షించుకోలేనని, యిల్లాలు అడ్డుగోడల్ని బాగా పెరుగనిచ్చి 'ఇది నా యిల్లు—యిందులోకి మరెవ్వరికీ

ప్రవేశార్హత లేదని' నిక్కచ్చిగా కట్టుదిట్టాల్ని చేస్తుందనీ శాస్త్రి బహుశా కలలోకూడా వూహించియుండడు.

వాన కురవసాగింది. కాళ్ళీడ్చుకుంటూ పొడుగ్గా కొల్లేటి చేంతాడులావున్న బేడారా రోడ్డును దాటివస్తూంటే, ఎక్కడా చెట్టూ చేమా అన్నది లేక చుట్టూ దిబ్బలేసుకుపోయిన యిసుక మైదానాలలో-వానకు వరదకు, ఎండకు గాలికి అన్నింటికీ తన శరీరాన్ని వప్పగించి కదలక మెదలక అట్లానే పడివున్న ఆరోడ్డు వొంటరితనానికికూడా శాస్త్రి జాలిపడసాగాడు.

అతనికి మరొక్కవిషయం స్ఫురణకొచ్చింది - తను చిన్నతనాన్ని దాటుతున్నానని క్రమేపీ యింకొక పదేళ్ళకు అంటే నలభై మేరల్లోకి వచ్చేసరికి, యవ్వనంలో దేనికోసమైన తపించి లభించక హతాశయులై హత్యలకు ఆత్మహత్యలకు యత్నిస్తుంటారో, సరిగా అటువంటి స్థితే తనకూ వచ్చినా-ఆ వయస్సులో అప్పుడిక స్త్రీకోసం జీవితాన్ని పాడుచేసుకుని పంచప్రాణాల్నీ వొడ్డేటంత తెలివితక్కువ మనిషిగా తను మారనని. తనకిప్పుడు ముప్ఫై బహుశా వుండొచ్చు. తల అక్కడక్కడ నెరుస్తోంది. ముప్ఫయేళ్ళకే పెద్దమనిషా—

శరీరంయొక్క భౌతికమైన పెరుగుదలను గుణించటానికి వయస్సు సాయమవుతుంది. లోపలి మనస్సుయొక్క వయఃపరిమితిని జీవితంలోని దుఃఖాలనుంచి యేర్పడ్డ వొత్తిడి నిర్ణయిస్తుంది. అందువల్లనే కొంతమంది వయస్సుమళ్లినవాళ్లుకూడా చిన్నపిల్లలమాదిరే వుంటారు. ఆ కారణాన్నే రైళ్లలో డిటెక్టివ్ నవలలు, పిల్లల పత్రికలు చదివే పెద్దవాళ్లు తారసపడుతూంటారు. అట్టే ఆశ్చర్యపడనవసరం లేదు వాళ్ళనుగూర్చి.

శాస్త్రికి అనుభవమైతే వుందికాని పది పదిహేడేండ్ల వయస్సుకు ముందు, బచ్చాలు, చెడుగుడు గూటిబిళ్ళ బంతిఆటలు ఆడుకొంటూ తిరిగి పెరగవలసిన వయస్సులో సుఖదుఃఖాల్ను తూచుకుందుకు వలసినంతగా శక్తి లేదు. తను లేని కుటుంబానికి చెందానని, పేదతనంవలన జీతం కట్టుకోలేకుండా వున్నానని తలకో పావలా అర్ధా సాయం చెయ్యవలసినదిగా పెద్దమనుష్యుల యెదుట నిలబడి అర్థించాల్సి వచ్చేది. అట్లా వినయవిధేయతలు గలిగిన ఒక బీదకుర్రవాడుగా వుంటూ పరిమితావకాశాల సుడిగుండంలో పడుతూ లేస్తూ మసిలి పెరిగిన వ్యక్తికి స్వేచ్ఛ నియమబద్ధమైన జీవితం,

నన్ను ముట్టుకోరు నామాలకాకి అనేట్లుగా తన వర్ణిలోకూడా జీవించవల్సివస్తే ఎట్లాగుంటుంది ? అంచేతే ఆ సంసారం సుఖజీవనసారం కాలేదు.

"ఆ చెల్లెలు—అదే నాకు మిగిలివుంది" అనేవాడు అర్థం చేసుకో మన్నట్లు.

ఇంకా ఒకప్పుడు ప్రాణం విసిగి కసిరేవాడు సరస్వతిని.

"నువ్వు ఏడ్చి పెడబొబ్బలు పెట్టనక్కర్లేదు. ఇక్కడ వుండటం ఈ చాకిరీ చెయ్యటం నీవల్ల కాకపోయినా, నీ కిష్టం లేకపోయినా నిక్షేపంలా మీ యింటికి నువ్వు వెళ్తానన్నా నిన్నేమీ అనేవాణ్ణి కాను."

ఈ ముక్కలు విన్నప్పుడల్లా సరస్వతి ముఖం అగ్నిగోళ మయ్యేది.

అట్లా చివరకు రెండు సమానశక్తుల తీవ్రమైన విజృంభణ వాగ్వాద పోరాటాలకు ఆ యిల్లు నిలయమై కూర్చుంది.

సరస్వతి యిలాగనేది,

"నేను మీ ఒక్కగాని ఒక్క చెల్లెలుకు రాకూడని జబ్బేదో ఆమెకే వచ్చింది. వస్తే చేయునన్నానా ? అంటువ్యాధికదా క్షయ. మన ఇంట్లోనూ చంటిపిల్లలు. ఎందు కిక్కడకని ఆ ఉద్దేశంతో అన్నానుకాని, మీకు లేని అభిమానం నాకుంటేమటుకు యీ కొంపమీద — అది ఎందుకు చెల్లు తుంది ? నీరసస్థురాలినని చేసుకోలేనని మీకేమన్నా వున్నది గనుకనా ? లోకం దీనికి పోడా పొబ్బా గిట్టదని అనుకుంటుంది. దానికితగ్గట్టే మీకూ నన్ను అవమానించాలనే వుంది. వుండబట్టే పుట్టింటికి పొమ్మని అంత తేలిగ్గా అనగలిగారు. నాకుపుట్టుకు ఏమిలేడిసింది యిక్కడ — కానీండి ? చెట్టుకు కాయలు బరువా ? నా వాళ్ళకు నేను బరువు కావటానికి వాళ్ళ కేమీ తక్కువ లేదు."

శాస్త్రి అప్పటికే గొంతు చించుకుంటూ నాలుగూళ్ళకు వినిపించేలా— "వెళ్లు వెళ్లు ఎవరున్నద్ధరిస్తా విక్కడ" అన్నాడు చిరాగ్గా,

అన్నట్లుగానే ప్రయాణమై వెళ్తూ "అంతా నన్ను వొంటెత్తు మనిషని చిన్నప్పట్నుంచీ వెక్కిరిస్తూ వచ్చారు. అమాటే మీకూ రూఢి చెయ్యాలని ఉంది. నేను ఏమైనా సహిస్తాను కాని అవమానాన్ని మాత్రం సహించను" అన్నది సరస్వతి.

శాస్త్రి ఊరుకోలేదు.

"నీ మాట చెల్లకపోతే నీ కేదో అవమానం జరిగినట్లే ఉంటుంది. నా సహజధర్మాలన్నింటినీ నీ కోసం వదిలేసుకుని జోగినై గంగిగోవులా దూడదూ దూడదూ బసవన్నా అంటే ఎగిరి గంతెయ్యకపోతే యింత రభసా చేసేదాని వేనా ?"

సరస్వతి తన సుందర ముఖారవిందాన్ని మాటి మాటికీ వొత్తుకుంటూ "మీ ధర్మాలన్నీ మీరు సక్రమంగానే నిర్వర్తించుకోండి. అయితే ఆ ధర్మ పరిపాలనలో కాస్త నాకు కూడా మిగిల్చి న్యాయం చెయ్యండి. ఎంతచెడ్డా మీ కంటికెంత దుష్టస్వభావురాలిలా ఉన్నా నా మెళ్ళోనూ ఒక పెద్ద పెయ్య కట్టుత్రాడు మంగళసూత్రమనే పేరిట బిగించారు. అదైనా ఊరి కే మాత్రం కాదు..."

శాస్త్రి కాలుకాలిన పిల్లిలాగున నిప్పు త్రొక్కిన కోతిలా అయి, "మరి అందుకా నన్ను కొనుక్కున్నట్లు మాట్లాడుతున్నది. విను, మీ ఇంట్లో అస్తమానూ పూజలు, నోములు, వ్రతాలని ఎంతో హడావిడి చేస్తూంటారే ఇంత కోపాగ్ని చల్లార్చుకోలేనిదానివి—ఎందుకు ? ఎట్లా సాగించాలనొచ్చావు జీవితం ! నీ మాట చెల్లకపోతే ప్రపంచమంతా తలక్రిందులు కావలసిందేనా ? ఛో, ఛో, నా కక్కర్లేదు" అనేసి చరచరా ఇంట్లోంచి చెప్పులు వేసుకుని నడిచాడు బయటికి.

శాస్త్రిది క్షణికమైన కోపమని తెలిసీ కూడా అభిమానం కొద్దీ ఆగకుండా పిల్లల్ని తీసుకుని పుట్టింటికి ప్రయాణమై ఆ రోజే వెళ్ళిపోయింది ఆ మహా యిల్లాలు.

చెల్లాయి వచ్చాక - రాజుమన్న అగ్గి ఆరిందనుకుని ఫలానా బండికి వస్తాను పంపమని బావమరదికి కబురు చేశాడు. మంత్రాలకు చింతకాయలు రాల్తాయా ? ఆశకొద్దీ స్టేషనుకు వచ్చాడు. సరస్వతి రాలేదు. కాని రైలు వచ్చింది.

౨

జీవించటం, జీవితము—అందులో సుఖపడ్డం వేరుగా ఉంటుంది. కష్టసుఖాలను పునరాలోచన చేసుకుంటూ నడుస్తున్న శాస్త్రికి అప్పుడే నెత్తిమీద ఏవో బరువుగా కదిలినట్లయింది. ఆలోచనల బరువేమీ కాదు.

పిల్లలు విరగబాటుగా నవ్వుతున్నారు. కొంతమంది చప్పట్లు చరుస్తూ వెంబడించబోతున్నారు.

వాన కురవటం మానిందిగదా అని తీగ నొక్కబోతే, గొడుగు వున్న మాటుగా ఒక్క కుదుపు కుదిపినట్లయి తేలికపడింది. ఏమిటాని చూడబోతే గొడుగు కామమీదుగా లంఘించిన ఆడకోతి, నేలమీదుగా పరుగెత్తుకుంటూ వెళ్ళి ప్రక్క గోడను ఎక్కి, తీరిగ్గా కూర్చోనబోతోంది.

పిల్లలంతా కోతి కోతి అంటూ రాళ్ళను గోడమీదకు విసర నారంభించారు. బయట వర్షం ముగిశాక రాళ్ళవర్షం ఆరంభమయిందా అన్నట్లుంది. అది కూడా పండ్లికిలిస్తూ, రోమాలన్నీ నిలబడగా, భయంతో కిచకిచలాడుతూ స్వప్రాణ రక్షణకోసం ఆ కొమ్మమీదనుంచి యీ కొమ్మమీదకు, ఇక్కణ్ణుంచి పెంకులమీదకు ఎగురుతూ నానా అల్లరి ఆరంభించింది.

అక్కడో పెద్ద గుంపు ప్రోగయింది. అందులో అన్ని వయసుల వాళ్ళూ ఉన్నారు. అందులో పిల్లలకు వేట సరదా హెచ్చింది. అది చేసే అల్లరికి వీళ్ళ కూడా వెర్రులెత్తిపోయారు.

శాస్త్రికి తానుగా అడ్డువెళ్ళి ఆ కోతిని కాపాడాలనిపించింది. 'ఎందుకా కోతిమీదకు రాళ్ళు విసురుతారు ఆగండ'ని మాటలతో వారించబోతే, 'పెద్ద చెప్పొచ్చావు వెళ్ళవయ్యా నీకెందు'కన్నట్లు చూశారు అక్కడి పిల్లమూక. శాస్త్రి ఊరుకునే మనిషికాడు. ఒకరిద్దరి చేతుల్లోని బెడ్డముక్కలను లాక్కొని నేలమీద పారేశాడు.

కోతి చూస్తూనే వుంది—శాస్త్రి బెడ్డలు గుప్పిళ్ళలోంచి లాక్కొని నేలమీదకు విసరటం. అంతలోనే పిల్లమూక ఎదురుతిరిగి శాస్త్రిమీదకు బెడ్డలు విసరసాగారు. ఒకటి నుదుటిమీదా, ఒకటి గుండెలమీదా, ఒకటి ముక్కుమీదా బలంగా తగిలాయి.

శాస్త్రికి ఉప్పూ పులుసూ తినే మనిషికి వచ్చేటంత కోపం వచ్చింది. గొడుగు ముడిచి కుర్రమూకను తరిమి తరిమి చావగొట్టాడు. ఆ ఘట్టం అభిమన్యుడు పద్మవ్యూహాన్ని భేదించిందానికేమీ తీసిపోదు. కాని చిన్న తేడా వుంది. అక్కడ ఒక కుర్రవాడు అతిరథుల్ని మహారథుల్ని గాభరా లెత్తిం

చాడు. ఇక్కడ ఒక పెద్దవాడు ఖర్రవేథవల్ని చెమడా లెక్కతీసి పరుగు లత్తేట్లు చేశాడు.

'చచ్చాంరా బాబో...' అంటూ కాలికొద్దీ దూసుకున్నారు.

అట్లా శాస్త్రి వాళ్ళని తరుముతూంటే పరుగు పరుగున వెనుకనుంచి వెంబడిస్తూ వచ్చిన కోతి అమాంతం కండ వెలికివచ్చేలా అతడిపిక్క పట్టేసుకుంది.

శాస్త్రి పెద్ద కేకపెట్టి అమాంతం ఆ కోతి పీకను రెండు చేతుల్లోకి తీసుకుని, నలిపి చంపేద్దామన్నంత వైరికోపంతో పైకెత్తాడు. అంతే—అది తన పొడుగాటి సన్నటి చేతుల్తో కళ్ళు తుడుచుకోసాగింది. అది చూసే చూపులు 'నన్నెందుకు చంపుతావు' అని జాలిగా అడుగుతున్నట్లున్నై.

శాస్త్రి జ్ఞానమున్న మనిషితో మాట్లాడినట్లుగా పళ్ళు పటపట లాడిస్తూ—"యింతసేపూ నా నెత్తిమీదకెక్కి సవారీ చేస్తివే? భడవా—ఇప్పుడు నిన్ను కాద్దామని వీళ్ళని తరుముతూంటే నన్నే పీకుతావూ? చూడు నిన్నేం చేస్తానో..."

అది అంతకన్నా తమాషాగా రెండు చేతుల్నీ ఎత్తి దండం పెట్టింది.

శాస్త్రి పెద్దగా ఆవులించి "హాసి-నీ యమ్మకడుపు బంగారంకానూ-ఎన్ని లయలే—" అంటూ చెవిమీద గిల్లాడు.

దాన్ని ఎత్తుకుని వస్తూంటే యింటికొచ్చే దారిలో, రెండుమార్లు అతని అరచేతులవగుండా జారి, గిల్లి తప్పించుకోవాలని చూసిం[ది]. శాస్త్రి దాన్ని యింకా హృదయానికి దగ్గరగా తీసుకుంటూ యిలాగన్నాడు—"చేసుకున్న ప్రేయసి చెప్పినా వినకుండా లేచిపోయింది. నువ్వుకూడా అట్లాగే చేస్తావా?" ఈ ముక్కలు అన్నాక కోతి మెడలోని వొంటినువ్వ శుభసూచనగా ఘల్లుమంది. శాస్త్రి బిగ్గరగా నవ్వాడు.

అతనికి ఆకలి వేసినట్లుగా అనిపించి కోతికేసి చూశాడు. అది బద్ధకంగా ఆవులించింది.

"సరే పద—నీ కిక్కడ విందు. రేపు యింటిదగ్గర నీకు పెళ్ళికూతుర్ని ముస్తాబు-సరేనా' అంటూనే శాస్త్రి మర్కట సమేతుడై హోటలు ప్రవే

శించాడు. ముప్పావలా బిల్లయేలా యిద్దరూ తినుబండారాలమీద కలబడ్డారు. కొంతవరకూ మచ్చికైనట్లే మర్కటకుంటరి బల్లమీద ఇటో చెయ్యి అటో చెయ్యి వడేసి, మధ్యగా సాసరులో శాస్త్రి వూది చల్లార్చిన కాఫీ వుంచగా-అమృతం త్రాగినట్లుగా ఎత్తి గొంతులో పోసుకున్నదై పెదవుల్లో తడి ఆర్చుకుంటూ నాలికంతా బయటపెట్టి తెగశుభ్రంగా నాక్కుంది మూతి.

ఇట్లా అరగంట కాలక్షేపమయేవరకూ, ఇంటివగ్గర చెల్లాయి సరస్వతి రాక నపేక్షిస్తూ, వక్కర్తీ కూర్చునివుంటుందన్న విషయం అతనికి గుర్తు రాలేదు.

'ఇక పోదాం యింటికి—' అంటూ లేచాడు. దాని దృష్టి తనవైపు లేదు. ఒదులొదులుగా పట్టుకుని పెద్ద పెద్ద అంగల్ని వేస్తూ యీవలకొచ్చి చూశాడు. భూమి అక్కడా అక్కడా గుంటలుపడ్డచోట్ల నీళ్ళను నిలవేసుకుని నడవటానికి కష్టమనిపించేలాగుంది. రిక్షాకోసం పరధ్యాసగా అటూ యిటూ కాస్త చూశాడు. కోతి అదే సందనుకుని తన్ను దూసుకుని వుడాయించేసింది. శాస్త్రి విస్తుపడి నిల్చుండిపోయాడు. చీకట్లో మరొకవైపు నుంచి అరిటిపళ్ళ అత్తాన్ని లంకించుకుని పరుగుపరుగున ఎగురుకుంటూ తన కాళ్ళమేరకు వచ్చి నిలబడ్డది.

శాస్త్రి ముక్కుమీద వ్రేలుమోపి కఠినంగా "తప్పు తప్పు. ఇట్లాటి వెధవ పెంకిపనులు చేస్తే నిన్ను ప్రేమించేది సున్న. పెండ్లికూతుర్ని చేసేది లేదు"

దుకాణం వదిలిన ఒక ఆడమనిషి లబో దిబో మంటూ వచ్చింది.

'పొరపాటున వదిలేశాను. ఎత్తుకొచ్చేసింది' అని క్షమార్పణలు చెప్పుకుని వెల ఇచ్చేసి తనూ సర్దిపంపాడు.

ఎకాయెకీ ఇంటికి చేరుకున్నాక చెల్లాయి గుమ్మంలోనే ఆతృతగా "వదిన రాలేదూ ?" అన్నది, వెనక మరో బండిగాని రిక్షావంటిదిగాని వస్తూ ఉండకపోవటాన్ని చూసి.

"వచ్చింది. పారిపోయిన మీ వదిన్ను పట్టి తెచ్చాను" అన్నాడు మందహాసంగా.

"ఏది ?"

శాస్త్రి కోతిని ఎత్తి చూపించాడు.

"ఇదేమిటి? ఇదెక్కడ్నుంచి?"

చెల్లాయి అడుగు వెనక్కువేసి దారి ఇస్తూండగా క్రొత్తమనిషిని చూడ్డంచేత కోతి కంగారుగా అర్టిపండ్ల అత్తాన్ని దాచుకోబోయింది.

శాస్త్రి "ఏమిటి? ఇప్పుడు దీనికేమి లోటుని—అచ్చంగా మీ వదినే శాపవశాన—ఎందుకే అమ్మాయి నవ్వుతావు? అహల్య రాయైపోలేదా? ఉద్దాలకుడు చండికను శాపమివ్వలేదా? నే నేమి తక్కువా—శాపమిచ్చేశాను."

చెల్లాయికి నవ్వాగింది కాదు. పొట్ట చేత్తో పట్టుకుని, "భలే—అన్నయ్యా! భలే!"

శాస్త్రి చంకనుండి జాగ్రత్తగా నేలకు దింపాడు. చెల్లాయి చోద్యంగా చూస్తూ 'పీకుతుందేమో అన్నయ్యా' అడుగు వెనక్కువేసి 'మా ఆసుపత్రిలో నువ్వు ఒక్కరోజు ఉన్నావంటే మమ్మల్నందర్నీ పొట్టలు చెక్కలయేలా నవ్వించి తీరుతావు. ఇదివరకు డాక్టరు 'నవ్వాలమ్మా, నవ్వితే నేగాని ఊపిరితిత్తులు శుభ్రపడవు' అంటూండేవాడు.'

శాస్త్రి చొక్కా విప్పుకుంటూ 'భయంలేదు, ఎందుకైనా మంచిది. మీ వదిన్ని రెండు రోజులు కట్టి పడెయ్యాలి. ఎక్కడికైనా ఉడాయించగలదు.' అని తాడుకోసం వెతికి పాత నులకమంచంనుంచి బాగా రెండు మూరల త్రాడును జమిలివేసి కోతి మెడలోని పట్టాకు కట్టి తన గదిలోని కిటికీవూచ కా త్రాడును ముడేసివచ్చాడు.

అతను యిటు తిరగ్గానే అది కిటికీలోకి ఎగిరి కూర్చుంది. శాస్త్రి తీరిగ్గా స్నానానికని లేచాడు.

చెల్లాయి జిహ్వాచాపల్యంకొద్దీ అర్టిపండుకోసం అత్తంమీదకు వంగి ఒక కాయ త్రుంచబోయింది. అది ఎట్లా పసిగట్టిందో కిటికీలోంచి మీదకు దుమికి చెంప ఛెళ్ళుమనేలా వాయించేసింది.

భయంతో మంచంవరకూ గెంతి 'రారో అన్నయ్యా. ఈ వదిన పీకుతుందేమో—బాబో...' అంటూ దుప్పటీ లాక్కుని వళ్ళు కప్పుకు మంచం నడుమకెక్కి కూర్చుంది.

శాస్త్రి వచ్చి దాని రెండుచెవులూ పుచ్చుకుని మెలేసి 'జాగ్రత్త' అని వురిమాడు.

సరస్వతి అని దానికి నామకరణం చేయటం జరిగాక ఒకవారం రోజులు అహర్నిశలూ తిప్పలు పడి దాని కా పేరు అలవాటు చేయటం జరిగింది.

పెండ్లికూతురుకు జరిగే గౌరవమర్యాదలన్నీ దానికి జరుగ నారంభించాయి. ఒక యినుపగోలుసు, ఒక పింగాణీకంచం యిత్తడిగ్లాసూ ప్రత్యేకంగా కొనటం జరిగింది. ఇక్కడకు వచ్చాక మంచిపోషణా అదీ వుండేమో బంతిలా తయారైంది.

శాస్త్రి ఆఫీసుకు వెళ్ళగానే చెల్లాయికూడా కూడా తిరిగేది. రేగిపళ్ళు వస్తే రేగుపండ్లు, జామికాయలు ఒకటేమిటి ఏది పడితే అది పుష్కలంగా దానికి పడేసేవారు.

చెల్లాయి వొదినా అన్నా అది వెనుదిరిగి ఎగురుకుంటూవచ్చి ప్రక్కను కూర్చునేది. దానికి శాస్త్రి రాకకూడా తెలుసును.

"అన్నయ్య వస్తున్నాడేమో చూడు......" అనటం తడవుగా మెట్లన్నీ ఎక్కి అతని గది కిటికీలోకి ఎగిరి కూర్చొని, వచ్చేపోయే గొడుగుల్ని, ముఖాల్ని పరిశీలిస్తూ ఆతృతగా చూసేది.

శాస్త్రిగొడుగు దానికి బాగా గుర్తు. చెల్లాయికి దాని ముఖంలోని సంతోషాన్ని చూస్తూంటే, అతని రాకకు సూచనగా ఆ గొడుగును వీధిమళుపులో చూడ్డంతో దాని కిచకిచల హడావిడికి ఎంతో ఆశ్చర్యం వేసేది.

అతను గడపదాకా రావటం తడవు ఆ గొడుగును లాక్కుని యీడ్చుకుంటూ యిల్లంతా అలంగం తిరిగేది. శాస్త్రి దాన్ని విడిచి ఒక్కనిమిషం కూడా వుండేవాడు కాదు.

స్నానాల గదిలోకి వెళ్ళితే అక్కడకూ, బట్టలు మార్చుకుంటూంటే ఆ చోటికీ, వ్రాసుకుంటున్నప్పుడు బల్లమీదా కూర్చునేది.

ప్రత్యేకంగా పువ్వుల జుబ్బాలు ఎన్నో కుట్టించాడు అతను దానికోసం. చెల్లాయి చిన్నచిన్న గళ్ళపరికిణీలు తయారుచేసి వాటిని తొడిగి అతను వచ్చేసమయానికి ముస్తాబు పూర్తిచేసి రెడీగా వుంచేది.

తీరిక సమయాల్లో దానికి కొన్ని మనుష్యుల అలవాట్లను నేర్పారు. ఏదన్నా తిన్నాక చేతుల్తో మూతి తుడుచుకుంటుంది. తన వస్తువుల్ని యితరులను వాడనివ్వదు. తనవి కానివి ముట్టుకోదు. పరికిణీ చొక్కా అసహ్యంగా మాపుకోదు.

శాస్త్రి స్నేహితులెవరైనా వస్తే వాళ్లు వెళ్ళేవరకూ కూడా వుండేది. రానురాను సాయంత్రాలు బీచికి షికారుకు వెళ్ళటంకూడా అలవాటయింది.

సబ్బుబిళ్ళ తువ్వాలు చేతికిస్తే అది శాస్త్రికి పట్టుకెళ్ళి యిచ్చేది.

ఒకరోజున శెనగలు, ఒకరోజున అరిటిపళ్లు, కారప్పూసలాటి వస్తువుల్ని రోజూ ఎవరో వకరు తెచ్చి బీచ్చిలో తినిపిస్తూండేవారు. శాస్త్రికి కోపం రావటంకూడా దానికి తెలుసు.

పెద్దపెద్ద కెరటాలు ఎగురుకుంటూ కట్టను ఢీకొంటున్నప్పుడల్లా కుప్పించి కుప్పించి యిసుకలో ఎన్నిరకాల ఆటలో ఆడేది.

శాస్త్రి మిసెస్సు బీచ్చికి రాకపోతే, ఆ రోజు మాత్రం ఎవరిళ్ళకు వాళ్లు పెందరాళే చేరుకునేవారు.

తరువాత చెల్లాయిని బెడ్ దొరికినందున ఆసుపత్రిలో చేర్పించటం జరిగింది. ముగ్గురికీ కారియరు వచ్చేది. శాస్త్రి పుష్కలంగా డబ్బు ఖర్చుపెట్ట నారంభించాడు. స్వయానా రెండుచేతులా చాకిరీకి దిగాడు. కారియరు తీసుకెళ్ళటంనుంచి నీళ్లు తోడ్డం యిల్లు సర్దుకోవటవరకూ పైనే పడింది. ఒక్కొక్కరాయి చొప్పున తీస్తుంటేకొండైనా తరుగుతుంది యిదొక లెక్కా అనుకున్నాడు లోపల.

## 3

ఒకమారు నిత్యజీవితము, అందులోని యాతనలు తాపత్రయాలనుంచి బైటకు వచ్చిపడ్డాక—వూపిరి పీల్చుకుందుకు స్వేచ్ఛగా, యేమేమి చేతామని లోపల వుంటుందో, వాట్లన్నిటిని ఆచరణలో పెట్టుకుందుకు పరస్వతికి యిప్పుడు వీలు చిక్కిందనే చెప్పాలి.

ఆలోచనలు పరుగెత్తినంత వేగంగా మనుష్యులుకూడా పరుగెత్తటానికి వీల్లేని గట్టి చిక్కొచ్చి పడింది.

సరస్వతికి చేతిలో డబ్బులేదు. పదిరూపాయలు వుంటే మాత్రం— అది ఏ మూలకూ చాలదు.

మాటమీద మాట అనుకున్న తరువాత 'శాస్త్రి' మాత్రం ఏ సౌకర్యమూ, మంచీ - చెడ్డా అన్నది చూడకుండానే వీధిలో కెళ్ళిపోయాడు.

అట్లాంటి మనిషిని ఏమని అడుగుతుంది? ఎంత పరాధీనపు బ్రతుకైనా—తానుగా యిప్పుడు సకిలించి సింహగర్జనలు చేసింది!

వాల్తేరుస్టేషనులో పెట్టె, హోల్డాలు, మరచెంబు, సజ్జబుట్ట రైలులోకి స్టేషనుకూలీ ఎక్కిస్తూన్నప్పుడు 'సరస్వతి' యిలాగనుకున్నది— 'ఆయనకు ఆ వచ్చేకోపం ఎల్లానూ వచ్చింది. పోతే పొమ్మని -విసురుగా ఆ నేనాడు జేబులోంచి పదో పదిహేనో తీసి నా మొహాన ఎందుకు కొట్ట లేదూ' అని.

ఆ వెళ్ళటం తిన్నగా ప్రసాదరావు దగ్గరకు—ఒక్కగాని ఒక్క చెల్లెలు తను. చూసికూడా ఎన్నోరోజులయింది. అక్కడ వుంటే దేనికీ అంతగా యిబ్బంది వుండదు. ఈ తిక్క కుదిరాక అప్పుడు చూసుకోవచ్చును. అంతగా కుదరక అన్నగారియింట్లో వుండటం యిష్టంలేకపోతుందీ, ఒక కార్డుముక్క గిలికిపారేస్తే తండ్రి వచ్చి పువ్వుల్లో పెట్టినట్లు తీసికెళ్ళడూ—

సరస్వతి ఆలోచించినట్లు వర్తించినట్లు ప్రాజ్ఞురాలైన స్త్రీ ఎవ్వతీ ఆలోచించదు.

స్వర్గం కానీ, నరకం కానీ, సుఖం కానీ, దుఃఖం కానీ—తనూ, తన యిల్లు తన సంసారమే, తనది కాని—యిది కాదని మరొకచోట, అదికాదని యింకొకచోటకూ, కుప్పిగంతులు వేస్తూ—పరుగెత్తటం వానర వనితలకే చెల్లుతుంది కాని మనుష్యులకూ సామాన్య సంసారులకూ కాదు.

అట్లా అని సరస్వతిని పూర్తిగా ఖాతినిచేసి వదలటానికి వీల్లేదు. ప్రపంచంలో ఒక రకం స్త్రీ లున్నారు. వారికి తమ ఇల్లు తమ సంసారము తమ చుట్టూ మనుష్యులు నచ్చరు. అదుగో వాళ్ళ మనిషి చేత కట్టెలు తెప్పించుకున్నారు. అవి ఎండు కట్టెలు. మరి మీరు వెళ్తే పచ్చి మొద్దులు- సుఖాన్ని బట్టి అమ్ముతారు కాబోలు అడివిలో. ఇట్లాంటి మాటలాడే వ్యక్తులు అస్తమానూ పొరుగింటి పుల్లకూరే రుచి అనుకుంటారు.

చంటిపిల్లడ్ని తీసుకుని బెజవాడ వచ్చాక అనుకున్నట్లుగానే తన జీవితము ఆరుకాయలూ మూడు పువ్వులుగా సాగుతున్నట్లు సరస్వతికి తోచింది.

ప్రసాదరావుకు రెండు చేతులా గట్టి సంపాదన వుంది. తినడానికి వెనుక పదిమంది ఎవ్వరూ లేరు. లింగూ లిటుకూ మంటూ యిద్దరు.

తీగలు తంపరలాగ పిల్లలా—లేరు.

అదృష్టవంతులైన బొడ్డున మాణిక్యం పెట్టుకు పుట్టిన స్త్రీ ఎంత సుఖపడుతుందో, ఆ ఇంట్లో ఆ వదినగార్ని చూసి తెల్సుకోవచ్చును అనుకుంది సరస్వతి.

ఆవిడకు రవ్వల ముక్కుపుడక, రెండు జతల రవ్వల దుద్దులు వున్నాయి. సాయంత్రం కట్టిన చీర మళ్ళీ ఉదయం కట్టదు. ముద్దులేసి ముక్కారు నగలు. కోరిన బట్టా కోరిన నగా తెస్తాడు అన్నయ్య.

సరస్వతి తన వదినగార్ని తల్చుకున్నప్పుడు ఆవిడ వైభోగాన్ని గుణించుకుంటున్నప్పుడు తన విశాఖపట్నంలోని రెండు గదుల డాబాఇల్లు - ఒకటి క్రింద, ఒకటి పైన, నల్లగా మాసిన కిటికీలు, గలీబులు లేని తలగడలు ఒకటి వుంటే ఒకటిలేని సంసారం. ఇందుకు పైగా ఏ నాలుగు రూపాయలన్నా జాగ్రత్త చేసుకుందామనే ఆలోచనే లేని తన భర్త-అన్నీ జ్ఞాపకానికొచ్చేవి.

చక్కగా వీధినుంచి ఏ వస్తువు కావల్సినా తెచ్చి పడేసేందుకు నవుకరు కుర్రవాడున్నాడు వాడే చంటిపిల్లవాడ్ని కూడా ఎత్తుకుని ఆడించసాగాడు. రోజూ సాయంకాలం ఏ సినిమాకో పాటకచ్చేరీకో లేడీస్ క్లబ్బుకో పోతూండవచ్చు.

ఈ సౌభాగ్యాన్ని కొద్ది కొద్దిగా అనుభవిస్తూ మధ్య మధ్యన, చెమటలు కారే ముఖంతో ఎడా పెడా మూటలు సంచులు మోసుకుంటూ యింటికి వచ్చే శాస్త్రిి ముఖం, గుర్తుకు వచ్చినప్పుడల్లా ఎవరో ఎక్కడ్నుంచో బలంగా విసిరిన రాయి వచ్చి గుండెలకు తగిల్తే ఎలా ఉంటుందో, అంతకన్నా ఎక్కువే బాధపడాల్సి వచ్చేది.

వచ్చిన వారం రోజులకు పిల్లడికి సుస్తీ చేసింది. డాక్టరువచ్చి మందిచ్చాక పది రోజులకు తగ్గింది. ఎంత పోషణ బాగున్నా వాడు ఎండలకు

తట్టుకోలేక నీరసిల్లాడు. వాడికి తగ్గిందో లేదో రెండు రోజులు తలనొప్పి-ఎలాగో అనిపించి తనుకూడా పడకెయ్యాల్సొచ్చింది. సరస్వతి కూడా పది పదిహేను లంఘణాలుచేసి వూచికపుల్లయి కూర్చుంది. ప్రసాదరావు అవీ ఇవీ తెస్తున్నాడు. జాగ్రత్తగానే చూస్తున్నాడు. ఇట్లా రెండవనెల కూడా పూర్తి కావచ్చింది. కాని ఇట్నుంచీ అట్నుంచీ కాకి కూడా కదల్టంలేదు. జ్వరం తగ్గింది. అస్తమానం డీలయిపోయినట్లుగా అనిపించేది లోలోపల.

లంఘణాలు చేశాక జుట్టు కూడా రాలిపోతూంటే బక్కపలచగా అంటుకుపోయినట్లున్న ముఖాన్ని మాటి మాటికి అద్దంలో చూసుకుంటూ 'ఎంత వికృతంగా వున్నాను' అనుకోసాగింది సరస్వతి.

ప్రసాదరావు స్నేహితుల్తో ముందు వరండాలో పెద్దగా నవ్వుతూ పిచ్చాపాటీ ఆడుతున్నాడు.

చంటిపిల్లవాడు మధ్యగదిలో చాపమీద పడుకున్నవాడల్లా వున్నట్లుండి లేచి పెద్ద పెట్టున రాగాలాపనకు లంకించుకున్నాడు.

వదిన కాఫీ కుంపటి దగ్గర కూర్చుని తెల్లారి లేచాక మూడోమారు అతిథులకోసం కాఫీ సరంజామాలో మునిగి తేలుతున్నట్లుంది.

సరస్వతి అంతక్రితమే తలంటిపోసుకుని దొడ్లో అరుగుమీద కూర్చుని తలకు చిక్కు తీసుకుంటున్నది. పిల్లడి బాకా గొంతుక వినిపించీ కూడా నీరసంతో లేవలేక ఏడవనీ అనుకుని మళ్ళీ దువ్వెన జుట్టులోకి పోనిచ్చి ఒక్కొక్కమారు ఎంత జుట్టు నష్టమవుతున్నదో చూసుకుంటూ దిగులుగా చతికిల బడిపోయింది.

అంతక్రితమే ప్రసాదరావు సిగరెట్లు కిళ్ళీలు తెమ్మని పురమాయించుట వలన వెళ్ళిన నౌకరు కుర్రాడు లేడు ఏడిచే పిల్లవాడ్ని ఎత్తుకునేటందుకు.

ఎవరో వొకరు ఎత్తుకుంటారులే అనుకుని వూరుకుంది సరస్వతి. మధ్యలో కాఫీ కాస్తున్న వదినె 'రావమ్మా—ఆకలికి కాబోలు పిల్లవాడేడుస్తున్నట్లున్నాడు' అని ఒక చిన్న కేక కూడా వేసింది.

సరస్వతికి లేవక తప్పిందికాదు. లేచి అలమార్లో పాలడబ్బా యివతలకు లాగి మూత తెరిచింది. దానినిండా చీమలు. కాస్తో కూస్తో మిగిలివున్న పాలగుండను కాస్తా అవి కాజేసినై. నాలిక కరుచుకుంటూ చాప వద్దకు వెళ్ళింది

పిల్లవాడు పెద్దగుక్క పట్టాడు. ఎత్తుకుని దొడ్లోకి వద్దామనుకుంటోంది.

"ఇంట్లో ఎవరూ లేరా-అవతల పెద్దమనుష్యులు మాట్లాడుతూంటే-యీ గోల-యిదేమిటి? కాస్త ఎత్తుకోలేరూ ఏడ్చే పిల్లవాడ్ని?" అంటూ వచ్చాడు ప్రసాదరావు.

పాలడబ్బా అయిపోయిందని చెప్పటానికి సరస్వతికి నోరు రాలేదు. చెప్పరాని భయం వేసింది. కాఫీకప్పుల్ని 'ట్రే'లో వుంచుతూ వదినె 'ఏమిటి చెయ్యమంటారు మధ్యాహ్నానికి. రెండుకూరలూ ఒక పచ్చడి చాలునా—'

"సగ్గుబియ్యపు పరమాన్నంచేసి వడలు వెయ్యి. అమ్మాయీ నీకు వడలు వెయ్యటం బాగా వచ్చు కదుటే—"

సరస్వతి గడపదాటుతూ 'ఆహ్హా—' అన్నది.

"ఆవిడా—ఆవిడవల్ల యేమవుతుంది?" అన్నట్లు ప్రసాదరావు ముఖంలోనికి చూసింది వదినె.

సరస్వతి తనదగ్గర పాలు యిచ్చి వూరుకోపెట్టడానికి ప్రయత్నించి విఫలురాలైంది. తన దగ్గిరకూడా లేవు. ఎండిన తన రొమ్ములను కాస్సేపు చప్పరించిన కుర్రకుంక కోపంగా అంగుటి బిగించి నములుతూ మళ్ళీ బాకా ఎత్తాడు.

సరస్వతికి టక్కున కోపం వచ్చి నాలుగు మొత్తింది.

"ఎందుకమ్మా వదినా-దేనికట్లా వాడ్ని బాదుతావు? నీకేమన్నా మతిపోతోందా?" అంటూ వచ్చింది నవ్వుతూ వదినె.

అల్లాగే వుంది అన్నట్లుగా దీనంగా చూసింది.

సరస్వతికి ఏమీ పాలుపోలేదు. ఆత్మాభిమానం అడ్డువస్తున్నా తెగేసి చెప్పింది—'పాలడబ్బా ఆఖరయిందని.'

"ఐతే వుండు. మా అన్నయ్యను పంపిస్తాను." అని చక్కా వెళ్ళిపోయింది ఆవిడ వాకిట్లోకి.

సరస్వతి మొదటిసారి కన్నీరు చెంపలవెంబడి కారింది. చెప్పనవసరంలేకుండా ఎక్కడో అప్పన్నా పుట్టించి పాలడబ్బాలు తెచ్చే శాస్త్రి

చేతులు—అవి ఎంతదూరాన వున్నాయో జ్ఞప్తికొచ్చి బెంబేలు పడ్డది మనస్సు.

అభిమానం - దేనికోసమైతే యింతవరకూ గ్రంథాన్ని పెంచుకుని వచ్చిందో అది కాస్తా బుగ్గయేలా 'అది కావాలి-యిది కావాలని యితరులను అడగాల్సి వస్తోంది.'

వోడిన చెప్పాలనే వెళ్ళిపోయింది. కాని తీరా చెప్పటానికి వీల్లేకుండా చుట్టూ ఎవరెవరో మనుష్యులూ - ఏవేవో వ్యవహారాలు మాట్లాడు కుంటున్నారు. మళ్ళీ వుత్తచేతులతో వెనక్కు వచ్చింది.

ఏడిచి ఏడిచి పిల్లవాడు వుత్తచూపులు చూస్తున్నాడు కాస్త కాఫీ పట్టారు ఎల్లాగో వాడికి. నౌకరు కుర్రాడు సరిగ్గా పన్నెండు కొట్టాక వచ్చాడు 'అన్నానికొస్తానండమ్మగారూ—' అంటూ.

"పాలడబ్బా తెచ్చి వెళ్ళమని" డబ్బులిచ్చింది వదినె.

ఆ డబ్బు లుచ్చుకుని అదేపాళాన పోయాడు. వాడు మళ్లా రాలేదు. పాలడబ్బా లేదు. పిల్లవాడి కడుపు వెన్నునంటుకుపోయింది. వాడు ఆకలితో అఘోరిస్తూంటే సరస్వతికి అన్న మెట్లా వెడుతుంది లోపలికి. ఆమె భోంచెయ్యలేదు. అందుకని వదినెకూడా మానింది.

ప్రసాదరావూ అతిథులూ టంచనుగా పన్నెండున్నర కొట్టాక పీటలమీదకు దిగారు. వదినే వడ్డనంతా చేసింది. సరస్వతి బయటమంచాలు పరిచి పక్కలు వేసింది.

భోజనాలయాక రికార్డులు పెట్టడంకోసం పడకగదిలోని రేడియో వద్దకు వచ్చాడు ప్రసాదరావు. అప్పుడు యావత్తు కథా వదినె అతడి చెవిని వేసింది. అతను మండిపడ్డాడు. ఇంటికి వెళ్ళి నౌకరు వెధవను జుట్టుపట్టుకు తంతానన్నాడు. తన్నడం కాదు మనకు కావలసినది ముందు పాలు అని చెప్పాక ఎకాఎకీ మధ్యాహ్నపు టెండలో బజారుకు పోయాడు. కొట్లన్నీ కట్టేసి వున్నాయి. ఆటూ యిటూ తిరిగి పిల్లలుగల ఒక స్నేహితుడియిల్లు పట్టుకుని ఒక చిన్న సంచీలో కాస్త రెండుపూటలకు సరిపడ్డ పాలపిండి ముష్టెత్తి తెచ్చియిచ్చాడు. అప్పు డతనివాలకం చూడ్డానికి సరస్వతికే భయం వేసింది. ఇద్దర్నీ కలిపి చెడమడా నాలుగు దులిపాడు.

అప్పుడే కొద్దిగా కోలుకుంటున్నది వైశాఖమాసం. ఎడ గాడ్పూ పెడ గాడ్పూను. వుండి వుండి అకాలంలో వానకూడా కురవసాగింది. సరస్వతికి ఏమీ తోచలేదు. నీరసంగావుండి యేపనీ ముట్టుకుందామనే అనిపించేది కాదు.

పాలుత్రాగాక కాస్సేపు యేడ్చి అట్టే నిద్రపోయాడు పిల్లవాడు. నెమ్మదిగా వోపిక చేసుకుని మెట్లన్నీ యెక్కి డాబామీదకు వెళ్ళింది. అక్కడా ఎండకు గచ్చంతా మాడివుందేమో-భగభగమంటోంది.

పిట్టగోడవారనే నెమ్మదిగా నడుస్తూ, ఆకాశాన ఇళ్ళకు మళ్ళిపోతూ గోలచేసే పక్షుల గుంపులు, చెట్టపట్టాలు వేసుకుని వూసులాడుకుంటూ షికార్లుకొట్టే స్నేహితుల్లా అక్కడక్కడ జంటలు జంజలుగా మేఘాలు - అంతకు తెప్పించి యేమీ లేదు. పశ్చిమాద్రిని ఎర్రటి సూర్యబింబం మునిగి పోతున్నది. దూరాన రోడ్డుమీద మనుషులు, వాహనాలు చిన్న చిన్న మూర్తుల్లా అగపడసాగారు. సరస్వతి మెల్లగా పిట్టగోడ అంచుమీద శరీ రాన్ని మోపి రవికలో దాచిన చిన్న ఉత్తరాన్ని మడతలువిప్పి చదువ సాగింది. మధ్యమధ్యలో నిదానంగా యిటూ ఆటూ చూస్తూ, మళ్లీ ఉత్తరం చదవటాన్నిబట్టి అది ఆమె యే మూడవసారో నాలుగవసారో అయివుం టుంది-ఆమె ముఖం కొద్దిగా కుంచించుకుంది. ఆటు తరువాత కాస్త ఎర్ర బడ్డది. మళ్లీ కొంచెం యీవలకు వచ్చి రెండు చేతులూ వెనక్కు మడిచి ఆలోచిస్తూ నిలబడ్డది. ఒకటికి రెండుమార్లు క్రింద పెదిమను కొరుకుతూ వెనక్కు విరిచిన చేతుల్తోనే పచార్లుచేయ నారంభించింది.

ఆ అవస్థలో ఆమె వదినరాకను గుర్తించి వుండలేదు. ఆవిడ కాఫీ కలరు కోయంబత్తూరు చీర నాజూగ్గాకట్టి తలలో చిన్న సన్నజాజి చెండును వుంచి మిగతా పూలను యివ్వటం కోసమంటూ, సరస్వతికోసం ఇక్కడా అక్కడా వెతుకులాడి, చివరకు డాబామీద ఎవరో మనుషుల చప్పుడు కాగా ఆ అలికిడికి పైకి చప్పున వచ్చింది.

సరస్వతిని దూరాన్నుంచి చూడగానే చిన్న తమాషా చేయాలని ఆవిడ పిల్లిలా అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చి వెనుకనుంచి చేతిలోని కాగితాన్ని చప్పున లాక్కుంది.

సరస్వతి తెలతెలబోతూ "నువ్వా వదినా...ఎవరో అనుకుని ఎంత హడలిపోయానూ—" ఆ అనటంలో లోపల ఏదో దాపరికం వున్నట్లు తేలిగ్గా యివతలవాళ్ళకు తెలిసిపోతోంది.

"ఈ కాగితం విప్పనా—"

సరస్వతి నేరస్థురాలిలా చూస్తూ వూరుకుంది. వులక లేదు, 'పలక' లేదు.

వొదిన లేనిచొరవను తెచ్చుకుంటూ "ఎందుకు నువ్వు అస్తమానూ వొంటరిగా దిగులుగా ఆలోచిస్తుంటావు. నీ కేదన్నా కావలిస్తే నాతో చెప్పవు...నాకు తెలుసులే—నీకు యిక్కడే యింత మొహమాటం..."

సరస్వతి యీ మాటలాడే మనిషి అంతస్సులోకి చూడాలనుకుని పరిశీలనగా "అదికాదు వదినా! నా కిక్కడేం లోటు? అడక్కుండానే అన్నీ అమర్చే వదినె...నాకోసం ముష్టెత్తడానికికూడా వెనుదీయని అన్నగారూ- యింకా ఏమన్నా వుంటే నావల్లే వుండాలి లోసుగు..."

"అడిగినదానికి సూటిగా జవాబు చెప్పు? నీ మనస్సులో ఏదో కదుల్తూ వుంటుంది అస్తమానూ—అవునా,.."

సరస్వతి పిట్టగోడమీద చేతులాన్చుతూ "ఏం చెప్పగలను. ఏం చెప్పమంటావు వదినా' అంటూ శూన్యంలోకి చూచింది.

"పిచ్చిదానా—నాకు తెలుసు. ఇవ్వాళే అన్నయ్య నా కంతా చెప్పారు."

సరస్వతి చప్పున వెనుదిరిగి 'అన్నయ్యా...' అని నోరు ఆవులించి పిచ్చిగా అథఃపాతాళానికి కృంగిపోతున్నట్లు 'అయోమయపు చూపులు చూసింది.

వొదిన సన్నజాజి చెండును మడిచి తల్లో ఉంచుతూ బుజంమీద చిన్న చిటికవేసి "అయితే నువ్వు పచ్చి దొంగవు సుమా, నీకు జ్వరంకూడా ఎందుకు వచ్చిందో నా కిప్పుడిప్పుడు కొంచమర్థమవుతూ వుంది. అలాంటి దేదైనా వుంటే నీ కన్నా కాస్త పెద్దగదా ఇంతముక్క నా చెవిని ఎందుకు వేశావు కాదూ?"

"ఏ ముక్క?" సరస్వతి అసంబద్ధమైన ఆలోచనల కూడికలోంచి తెప్పరిల్లలేక తలను దించుకునే అనేసింది.

"అదే- నాకు తెలియదనుకున్నావా ఏం? అతను నిన్ను వెళ్ళిపొమ్మని గసిరిన సంగతీ అదీను."

"వెళ్ళిపొమ్మనా ? అవును అన్నారు. అంటే వచ్చేశాను."

"పోనీ స్టేషనుకు వచ్చినా టిక్కెట్టూ అదీ కొని ఇచ్చాడా ?"

నా దగ్గరే పది రూపాయలుంటే, పోర్టర్ని బ్రతిమాలి కొనిపించు కున్నాను."

చీకటి మసగ్గా అలుముకొంటున్నది. ఆకాశంలో కూడా, ఆలస్యంగా వెళ్ళే ఏ ఒకటి రెండు పక్షులో మినహా అంతా సంచార శూన్యంగా వుంది.

వొదిన ప్రశ్నా పత్రంలో కొన్ని చిక్కు ప్రశ్నల్ని వదిలేసి అడగటంవల్ల సరస్వతి తేలిగ్గా సమాధానాల్ని యివ్వగలిగింది.

చాలా నెమ్మదిగా—

"అయితే ఈ ఉత్తరం కూడా చదవనా ?"

సరస్వతికి 'ఈ ఉత్తరం కూడా—' అన్న లౌక్యపుపొడి - మెలిక విప్పుకోలేక బిత్తరపోతూ- ఇంకా యేమన్నా వున్నాయా జాబులు—'అని ఆగింది. తన సంశయానికి అవతలి మనిషి తప్పు తీసుకుని నొచ్చుకుంటుందేమో అనుకుని.

'మీ అన్నకు వ్రాసిన ఉత్తరం—అదే దానిమాటే' సరస్వతి సగం ఆశ్చర్యాన్ని లోపల్నే అణచివేస్తూ, 'ఈ ఉత్తరం ఆయన వ్రాసింది కాదు' అనేసి ఆ అనటంలోనే తనకేమీ అభ్యంతరం లేనట్లు సూచించింది.

అటుతర్వాత ఇద్దరూ డాబామీద కూర్చున్నారు. వొదిన అనునయ కంఠంతో, తూచినట్లుగా 'నీవల్ల తప్పుండదని నే నన్ను. కాని చటుక్కున అంత తేలిగ్గా వెళ్ళిపొమ్మని అనటం వుందే; అది అభిమానమున్న ఆడదానికి ప్రాణం తీసేసినట్లే.'

"ఊఁ..."

"అదీగాక మీలో మీకు ఇంత వైముఖ్యం రావటానికి తగినంత పెద్ద కారణం నా కేమీ గోచరించటంలేదు కూడాను."

సరస్వతి వూగాడ్తోంది కాని ఆ పెద్ద కారణమేదో బయటపెట్టలేక పోతోంది. వొదిన చాకచక్యంగా మళ్ళీ అందుకుండి—

"అంతెందుకు ? మీ అన్నయ్య వున్నారా ? అంతలా చనువు యిస్తూన్నట్లగపడ్తారు కాని, అబ్బో సమయంవస్తే ఆయనమట్టుకు ఎంత మగతనం చలాయిస్తారని ?"

'అలాగా !' అని ఇంకా చెప్పమన్నట్లు చూసింది సరస్వతి. 'మీ వంశంలో ఉన్నదే ఒక గుణం, నీకు కోపం రాదంటే చెబుతాను' సరస్వతి మందహాసంగా 'చెప్పు. నాకు కోపమెందుకు ?'

"మొండి పట్టుదల, కోపం. అవతలివాళ్ళ పరిస్థితీ మంచిచెడ్డ-కూడా ఆలోచించకుండా తాము కోరినట్లే ఎందుకు జరక్కపోవాలీ అని పంతగించుకోవడం మామూలే___"

సరస్వతి లోపల ఇలా అనుకోసాగింది-యీ వరసను తన్ను దెప్పటం లేదుకదా, ఏమో ! అవును ఉన్నమాటంటే తనెందుకు ఉలికులికి పడాలి !

'అది కాదమ్మా, ఆ రోజు ఆయనగార్కి తలనొప్పి జ్వరమట. ఆ సంగతి నాకెలా తెలుస్తుంది చెప్పు. మధ్యాహ్నం వెళ్ళేముందు క్లబ్బుకు వెళ్తున్నానని చెప్పి మరీ స్త్రీ సమాజాని కెళ్ళాను. ఆరోజు చాలామంది కలియటంవల్ల ఆమాటా యీమాటా చెప్పుకుంటూ కూర్చుండిపోయాం. బైట చల్లగావుంటే కొబ్బరిచెట్ల నీడను ఫేముకుర్చీలు లాక్కుని. నా చిన్ననాటి స్నేహితులు ఒకరిద్దరు కలిశారు. చెప్పొద్దూ — ఆరోజు బాగా యెనిమిది దాటాకే యింటి కొచ్చాను. తప్పల్లా కొంచెం ఆలస్యంగా ఇంటికి రావటం-తను అంతక్రితం ఎన్నిమాట్లో రెండో సినిమాకు వెళ్ళికూడా అర్ధరాత్రి అపరాత్రి రావటంలేదూ - అవన్నీ పట్టించుకుంటామా ? దాన్తో మొదలెట్టారు ఎకసక్కాలు-మగవాడు తిరక్క, ఆడది తిరిగి చెడిందట. నాకు వొళ్ళు మండి నాలుగు రోజులు ఏడుస్తూ పడుకున్నాను. ఎందుకులే అన్న ముక్క అనలేదు. పలకరించిన పాపాన పోలేదు. అంతటితో వూరుకోవచ్చునా పుండుమీద కారం జల్లినట్లు అమ్మకు పనివేళ్ళా ఒక కొంటెవుత్తరం రాశారు. అసలే ఆవిడ అంతమాత్రం. అల్లుడు కూడా వ్రాశాక నాకు హితోపదేశాలు చెబుతూ చాటభారతమంత జాబు వ్రాసింది. ఇదేమిటని ఆయన్ను అడిగితే వెకవెకా పకపకా నవ్వు—మంచీ చెడ్డా వుంటేనా...వూరుకోలేదు. కోపం కొద్దీ అనేశాను. నేనేమి కాపురాలు త్రవ్వుకుని లేచిపోయే మనిషి ననుకున్నారా—యింత మళ్లు మీ కడుపులో పెట్టుకుని ఎందుకొచ్చిన వెటకారమని___"

సరస్వతి సావధానంగా విన్నాక తన కథతో పోల్చుకోకుండా ఉండలేకపోయింది. ఎంత వద్దనుకున్నా తన విషయాని కొచ్చేసరికి తప్పంతా అవతలి వ్యక్తిదైనట్లుగా వాదించటానికి అంతరాత్మ ససేమిరా రావప్పటం లేదు.

"లేద్దామా సరూ..." అంటూండగానే, "అయ్యో-పిల్లాణ్ని ఒక్కణ్ణీ వదిలేసి వచ్చానుర్రా" అంటూ సరస్వతి గబగబా మెట్లు దిగింది.

లోపల అన్నగారు ఎత్తుకుని ఆడిస్తున్నవాడల్లా సరస్వతిని చూడ్డంతో "యిందే—అమ్మాయీ" అని అందివ్వబోయాడు.

సరస్వతికి నవనాళ్ళూ కృంగినట్లయి తలకాయ వాల్చి తప్పుచేసిన మనిషిలా పిల్లణ్ని అందుకుని అక్కడ నిల్చోకుండా నాలుగంగల్లో దొడ్లోకి పరుగెత్తుకొచ్చేసింది.

వొదిన సరస్వతి చేతులోంచి లాక్కున్న కాగితం ముక్కను చదవాలనే కుతూహలంతో నేరుగా పడకగదిలోకి వెళ్ళి బెడ్‌లైట్ స్విచ్చి నొక్కి తలగడ నానుకొని మెల్లగా కాగితపు మడతలను విప్పసాగింది. ఆ రావటంలో మధ్యగదిలో కుర్చీలో కూర్చున్న ప్రసాదరావును కూడా ఆమె గమనించ లేదు.

ఎటువైపునుంచి వచ్చాడో ప్రసాదరావు గ్రద్దలా ఆ ఉత్తరాన్ని కాస్తా ముక్కున కరుచుకుని నిశ్చలంగా వుడాయించే యత్నంలో వున్నాడు.

ఆమెకు చాలా కోపం వచ్చిందనే చెప్పాలి. పరుషంగా "నామీద వొట్టే అది మీరుగనుక చదివితే..."

"ఇందులో యేమిటి వుంది ?"

"నాకు తెలీదు."

"ఇది పచ్చిఅబద్ధం. పోనీ ఎక్కణ్నుంచి...?"

ఆమె యింకా కోపంగా "ఎక్కణ్నుంచా ? నా శ్రాద్ధంనుంచి."

"అదికూడా నేనే పెట్టాలి. నాకు శ్రాద్ధం పెట్టేవాడు కలిగేవరకూ నీకు శ్రాద్ధం కావాలనుకోకు."

'ఏమిటి శుభమంటూ తిని కూర్చుని చావుల మీదకు పోతున్నారు' అంటూ వచ్చింది సరస్వతి. ఈ ముక్కలు అనే ధైర్యం ఎట్లా వచ్చిందో

వదినకు అర్థంకాలేదు ఆశ్చర్యంతో-'ఏదీ ఆవిడ ఉత్తరం ఆవిడ కిచ్చెయ్యండి' ప్రసాదరావు రూక్షంగా- 'అయితే ఆవిడ ఉత్తరం నువ్వెందుకు తీసుకుని చక్కగా మడతల్ని విప్పి కులుకుతూ చదువుతున్నావు ?'

"నే నేమీ చదవలేదు."

సరస్వతి ఇద్దరి తగూ తీర్చే ధోరణిలో "నే నే ఇచ్చానర్రా బాబూ అందులో ఏమీలేదు. మా ఆడపడుచు చెల్లాయి వ్రాసింది."

కథ అడ్డం తిరిగిందేమనుకుని—

"చెల్లాయా...ఇంకా మీ ఆయన చార్జిషీటు ఇచ్చాడేమో నను కున్నాను నేను."

ప్రసాదరావు మెల్లగా జారుకోబోతున్నాడు. వదిన గడుసుతనంగా "పాపం! ఎందుకు జారుకుంటున్నారు. ఏమి వ్రాసిందో మీరు కూడా వినండి. ఆనక మళ్ళీ నేను ఫలానా అని చెబితే నమ్మేస్థితిలో వుండరు" అనేసి, నవ్వుతూ "చిన్న ఉత్తరమర్రా—పెనసలుతో వ్రాసింది పాపం, చదువు తాను—మ. ల. స. వొదినకు చెల్లాయి నమస్కారములు. అంతా క్షేమం. మీ క్షేమం, చంటివాడి క్షేమం బొత్తిగా తెలియటంలేదు. అన్నయ్య రోజు రోజుకీ మారిపోతున్నాడు. నాకు భయం వేస్తున్నది. ఈ మధ్యన నువ్వు వస్తావనుకుని స్టేషనుకు వెళ్ళాడు. సరే-ఆ వేళ వస్తూ దారిలో ఒక కోతిని పట్టుకొచ్చాడు. దానికోసం ఎంత డబ్బు ఖర్చుపెడుతున్నాడో చెప్పటానికి వీల్లేదు. నేనూ మొదట్లో కాలక్షేపంగా ఎంతో సరదాపడ్డాను. కాని ఆ ప్రవర్తన చూస్తున్నకొద్దీ ఎందుకో నాకే దిగులువేస్తున్నది. ఆ కోతిని తెచ్చాడన్నానా-దానికి నీ పేరుపెట్టాడు. అందరితో అది నా భార్య-చాలా విశ్వాసంగా వుంటుంది-అని చెబుతూంటాడు. ఇదంతా చూస్తూంటే నాకు నువ్వు ఎంత చప్పున వస్తే అంతమంచిదని తోస్తోంది. నా ఆరోగ్యం కొంచెం బాగు. నా వలన తప్పులుంటే క్షమించి వస్తావని తలుస్తాను. చిన్నినాన్నకు ముద్దులు"

చెల్లాయి వ్రాలు.

ఉత్తరం చదివాక వొదిన ఏమీ మాట్లాడలేదు. సరస్వతి తలనువాల్చి నేలమాపులు చూడసాగింది ప్రసాదరావు స్తబ్ధతను భంగపరుస్తూ—

"బావ రోజురోజుకీ అచ్చం కోతిలా మారిపోతున్నాడే—"

కథా నిలయం
3754
శ్రీకాకుళం

ఈ హాస్యానికి ఎవ్వరూ నవ్వలేదు. వదినె కఠినంగా చూసింది. ప్రసాదరావు సర్దుకుని "వెళ్తావా ?" అని సరస్వతికేసి చూశాడు.

ఆ వెళ్తావా అనటంలో దిగబెట్టివస్తాననే అర్థం ఎక్కడా సరస్వతికి తట్టలేదు. గ్రహించిన వదిన భర్త వాక్యాన్ని సర్దుతూ "నీకు వెళ్ళటం యిష్టంగా వుండకపోతే ఎందుకు-ఆయన్నే యిక్కడకు రప్పించే యేర్పాటు చేస్తేసరి !"

సరస్వతి వెంటనే "రాను" అనేసి మళ్ళీ చప్పున సిగ్గుపడిపోయింది.

ప్రసాదరావు నవ్వాడు. 'నే నతను పంపమని వ్రాసినదానికి సమాధానం వ్రాయలేదు కూడా.'

సరస్వతి గాబరాగా తలెత్తింది. అంతవరకూ తన్ను పంపమంటూ జాబు వచ్చినట్లే ఆమెకు తెలియదు. చెల్లాయి వుత్తరం పూర్తిగా యిప్పుడు బోధపడినట్లే.

ఆ రాత్రి పసిపిల్లణ్ని పక్కలో పెట్టుకుని యేడ్చినది యేడ్చినట్లే వుంది సరస్వతి. అప్పుడు యిల్లా అనుకోసాగింది—'నేనే పాపిష్ఠిదాన్ని. చేతులారా నా కష్టాలు కొని తెచ్చుకున్నాను. మా అన్నయ్యా వదినా నన్నెంత గౌరవంగా చూస్తున్నారో చెల్లాయిని ఆయనట్లా చూసుకోవటం సహించలేకపోయాను. నా అసహనం నన్ను కోతిని చేసి పారేసింది. ఆయన కోతిని తెచ్చి దానికి నా పేరెట్టారని అభిమానపడి యేం ప్రయోజనం ? ఎవరు విన్నా చివరకు నేను చేసిందే కోతిపని అంటారు. ఏ మొహం పెట్టుకుని నేను ఆ మహారాజు పంచలకు చేరుకునేది ?' సరస్వతి ఆలోచనల బరువులో దొర్లిన గంటలను గుర్తించలేక, కోడికూత విని అప్పుడే తెల్లవారిందా అనుకోసాగింది.

౪

బండీవచ్చి గుమ్మంముందు ఆగింది. చదువుతున్న పత్రిక పుటల్ని త్తిగించి ప్రసాదరావు ముందుకు చూశాడు. అప్పుడే ముగించి విడిచిన కాఫీ కప్పు వొత్తిగించటంకోసమని ప్రత్యేకంగా వచ్చిన వొదిన నోరు తెరచి విస్తుబోయి చూస్తున్నది.

మెల్లిదాకా వచ్చాక-'మేమేనర్రా—ఏమిటట్లా గుడ్లప్పగించి చూస్తున్నారు ?' అంటూ పైకి రావటంకోసం ఫ్రూతకర్రను బలంగా నేలకు అదిమి వెనుకకు వినిపించేలా—

"అమ్మా—నువ్వుకూడా నాతో ఒదుంగున యింట్లోకి జొరబడకు. పడుచుదానివి యింకా కాస్త-సామాన్ను లోపలకు చేరవేయించు."

వాక్యం ముగియకుండానే అవతల చేతులోని సిగరెట్టును బహు చాకచక్యంతో నులిమేసి లేస్తూ ప్రసాదరావు వాకిట్లోకి గబగబా నాలుగడుగులు వేశాడు.

గుమ్మంలో నిల్చున్న పార్వతమ్మ "ఏంరా నాన్నా, కులాసా ? కాశీ వెళ్దామని బయల్దేరదీస్తే వున్న పాళానా ఇలా వచ్చేశాం. మీ నాన్నగారితో ఏదొచ్చినా నోట్లోమాట నోట్లో ఉండగానే కావాలి పనులు. లేడికి లేచిందే పరుగు."

"నువ్వు లోపలికి నడు... నేను చూస్తాన్లే..."

తరువాత జట్కావాలాతో చిన్న యుద్ధకాండ పావుగంటసేపు జరిపి డబ్బులు మొహాన్న విసిరికొట్టాక, మెల్లగా లోనికి వచ్చాడు ప్రబుద్ధుడు ప్రసాదరావు.

అప్పటికే తల్లీ కూతుళ్లు సాశ్చర్యసంభ్రమాభిమానాల్ని ప్రకటించుకోవటం, కుశల ప్రశ్నలవరకూ సంభాషణ రావటం జరిగింది.

ప్రసాదరావు వచ్చి చూసిన దృశ్యంయొక్క సందర్భం యిది.

సరస్వతి తల్లిని రెండు చేతుల్తో పట్టుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్నది. ముసలాయన చంకలోని పిల్లవాడు పండిన ఆయన మీసకట్టును చూసినంతసేపు చోద్యంగా చూసి, చేతుల్తో అందుకోవటం కోసం విశేషించి యత్నిస్తున్నాడు.

ప్రసాదరావు భార్య ఊరంత గొంతుకతో వార్తల్ని చదువుతున్న రేడియో గొంతు నొక్కివచ్చి, మెల్లగా సరస్వతిని దొడ్లోకి నడిపించుకు వెళ్ళింది. ఆడవాళ్లు ముగ్గురూ విడిపోగానే ముసలాయన కళ్ళజోడును మసు మడి బారినుంచి భద్రంగా రక్షించుకొంటూ కొడుకు నుద్దేశించి "ఏమిటి కథ ?" అన్నారు.

ప్రసాదరావు తన కేమీ తెలియనట్లు 'ప్చ్' అనేసి ఊరుకున్నాడు.

"ఎప్పుడు రావటం ?"

"నెల్లాళ్ళయి—"

"నాకు తెలియలేదే!"

కొడుకేమీ జవాబివ్వకపోవటం చూసి-"ఇదా...నాకేమీ క్షేమ సమాచారాలు తెలియకపోవటంచేత ఒకమారు అట్లా వెళ్ళిరానా అనికూడా అంటూ వచ్చాను. మీ అమ్మే—వట్టి చండోడి మనిషి. ఎద్దు ఎండకు లాగితే దున్న నీడకు లాగుతానంటుంది."

"వెళ్ళి రావలసింది. కథంతా అర్థమయేది—" చేత్తో చిన్న పూచిక పుల్లను విరిచి పళ్ళు కుట్టుకుంటూ నసిగాడు కుర్చీతోసహా వెనక్కు నడుం విరుచుకుంటూ.

"హా హా—ఏదోవుంది" అన్నారు ముసలాయన.

పూచిక పుల్లతో గాలిలో సూచిస్తూ "ఇప్పుడేం లాభం అనుకుని—అటువంటి సంబంధం చేశాక—"

ముసలాయన ఒక్కమాటు బుజాల్ని దులుపుకుని చేతిలోని కర్రను కుర్చీ వెనుక వ్రేలాడేస్తూ 'ముసలాడి కబుర్లు నీకు పచ్చి పచ్చిగా ఉంటాయి గాని, యీ తల పూర్తిగా పండేదాకా నౌకరీ చేశానా, దేశంకాని దేశం—అక్కడా ఇక్కడా ఉంటూ వచ్చానా, ఎన్నిరకాల మనుష్యుల్ని చూడలేదు ? అంతా ఒక్కలా ఉండరు. అదలావుంచు. ఎప్పుడూ మనమే నెగ్గాలనుకునే మన స్తత్వంకల మనుష్యుల్ని చూశాను. కొన్ని సందర్భాల్లో గెలుస్తూ మళ్ళీ వోడుతూ జీవితం సాగించే వ్యక్తుల్ని చూశాను. పట్టూ విడుపూ అన్నదుండాలి. అదిలేని వ్యక్తుల్లో అందులో హామేశా మనమే ముందుండాలి-మనమాటే నెగ్గాలి అనుకునే వాళ్ళతో జీవించటం ప్రమాదకరం. మీ అమ్మ ఉందా ? అది కాపురానికొచ్చిన క్రొత్తల్లో వట్టి గొడ్డు. మొరాయించటం కరవటం వుండేదికాదు. ఆఖరికి నాకు తెలియకుండా అణా అర్థా తీసి యే పోపుల డబ్బాలోనన్నా చేరేసి ఒక పది రూపాయలు చేస్తుందేమో అని చూశాను, ఆ తెలివి తేటలు కూడా లేవు. కాని అట్లాటి మనిషితో కాపురం నా కేమీ కష్టమనిపించలేదు. కాని మళ్ళీ మీ చిన్నత్త

చచ్చిపోయిందిలే, నువ్వు పుట్టాక. అంచేత తెలీదు. ఆవిడ మొగుణ్ని రాచి రంపాన పెట్టేదని నలుగురూ అనుకునేవారు. నాకేం మొహమాటం లేదు. అడిగేద్దామా అన్నంతవరకూ వచ్చింది. కాని చూస్తూ చూస్తూ ఆడబిడ్డను నే నేమన్న. ఒకమాటు దాన్ని పుట్టింటికి తీసుకురమ్మంటే నేనే బయల్దేరి వెళ్ళాను. గుమ్మం ప్రక్కనే స్కూలు. ఆ బడిపిల్లలు కిటికీ దగ్గరకు వస్తే పల్లంలో వీళ్ళ దొడ్లో అంతా కనబడుతుంది. అప్పుడు వాళ్ళేదో అంటు న్నారు. ఇది వాళ్ళను చెరిగేస్తోంది తిట్లతో. ఏమిటే ఆ పిల్లలు అంటున్నది అని అడిగాను రావటంతో. దానికి నా మీద కూడా కోపమొచ్చింది. తరువాత తెలిసింది, 'అయినకాడికి అణా పరక—' అని పిల్లలు పిలుస్తారని. బజారుకి ఆ వూళ్ళో పనిమీద బయలుదేరితే ఏ గోడమీద చూసినా అయిన కాడికి అణాపరకా. ఒకగుంట వెధవని పిలిచి 'ఏంరా-ఆమాట' అన్నాను. వాడు నవ్వుతూ పరుగెత్తుకుపోయాడు. నేను స్వతహా కొంటెమనిషిని— ఆరోజు దీపాలుపెట్టాక దారిలో ఎదురైతే 'ఏమిటి బావా—అయినకాడికి అణాపరక అని రాసుంది మీ యింటిమీద-' అని ఖర్మంజాలక నోరుజారాను. అగ్గిరుద్రుడయాడు. ఎల్లాగో తెలుసుకున్నాను. ఒకరోజున వుదయం 8 గంటలకు బజారుకని బయల్దేరి, ఏదో ఒక తోటకూరకట్ట, కాసిని పచ్చిమిరప కాయలతో అడుగుపెట్టాట్ట యింట్లో. స్కూల్లో ఒకటికి బెల్లు కొట్టారు. అప్పుడు మీ చిన్నత్త చింత రుప్పలాటి తలేసుకుని తడిసిన చీరతో వురుము కుంటూ వచ్చి 'ఏమిటి తగలేశావు?' అందిట. 'ఫలానా—' అన్నాక 'ఎంత యింది?' అని గర్జించిందిట. 'అణా పరక—' అన్నాక ఆలస్యమయిందని శాపనార్థాలు పెడుతూ 'ఇంనాతే అయినకాడికి అణాపరక' అంటూండగా స్కూలుపిల్లలు విని ఆ ముక్క పుచ్చుకున్నారు.

'ఇంతకథా నీ కెందుకు చెప్పానంటే, ఆవిడ పోలికే అచ్చంగా మన సరస్వతి.'

ప్రసాదరావు రూక్షంగా—'మీ కసలు ఏం తెలీదు. మీరు దానికి చాలా అన్యాయం చేశారని నే ననబోతున్నందుకు ముందుగా యింత చరిత్ర చెప్పుకొచ్చారు. నాకు తెలుసు నాన్నా—ఇంకా ఏం కావాలి? నిల్చున్న పాళాన చంటిబిడ్డతో ఇంట్లోంచి పొమ్మని అన్న మనిషికి ఏపాటి సంస్కారం వుంటుందనుకునేది?'

"అతనలాటి మనిషి కాడు." ముసలాయన సమర్థిస్తూ గట్టిగా అన్నారు.

ప్రసాదరావు క్షణంసేపు లేచి నిలబడి పరుషంగా—'మీరు చేసింది తప్పు కాదని సమర్థించుకోవటంకోసమే చూస్తున్నారు గాని మన గౌరవం ఏ మాత్రం అతగాడు నిలబెట్టాడో ఆ విషయం ఆలోచించటం లేదు."

ముసలాయన యీలోగా 'అమ్మా కొంచెం 'టీ' పట్రా. సుపుత్రుడు దేవతలకు పంచాంగాలు చెబుతున్నాడు.' అనేసి 'కూర్చోరా నాన్నా—కూర్చో...' అని ప్రసాదరావు నుద్దేశించి అన్నారు.

ప్రసాదరావుకు వోటమి యిష్టంలేదు. ఆయన వాదించి తనచేత అవు ననిపిస్తారనే భయం లేకపోలేదు లోపల. అదిగాక స్వయానా కూతురి విష యంలో ఆయన అల్లుడిపక్షం తీసుకోబోవటం చూస్తే తనకే ఎట్లానో కచ్చగా వుంది. అందుకనే లేచి తప్పుకుపోవాలని చూశాడు.

ముసలాయన అన్నారు,

"ఈ ఒక్కమాట విను. నీకు తెలిసింది, చాలామంది అనుకునేది, మను షులంతా డబ్బుగలవాళ్లు, లేనివాళ్లు అనే. ఈ రెంటిమధ్యా సంబంధబాంధ వ్యాలు పొసగవనే. పైగా యీ విభజనలో తప్పుందంటాను నేను. మను షుల్ని తత్వాలవారీగా విభజించి పరీక్షించా లంటాను. శాస్త్రిని నేను అట్లానే కొల్చి చూశాను. అతను యితరులకు కష్టం కలిగించడు. ఇతరులు తనను కలిగిస్తే ఓపికతో సహించి వూరుకుంటాడు. బస్. యిక నీవు వెళ్ళచ్చు."

"మరి యీ జరిగిన రాద్ధాంత సిద్ధాంతాలన్నీ?"

"ఏ రాద్ధాంత సిద్ధాంతాలు...?"

"ఇదిగో, ప్రత్యక్ష్యంగా కనబడుతున్నదే పుట్టింటికి తోలెయ్యటం-"

"హాఁ! అదా-ఏదో మాటామాటా వస్తే అమ్మాయే వచ్చేసుండచ్చు. మన బంగారమే మంచిదని అస్తమానూ అనుకోవడం తప్పురా. ఎవరివాడి కంట్లో దూలం వెతికేముందు మన కంట్లో నలుసు అఘోరించిందేమో చూసుకోవద్దూ!"

"చూసుకోవాలి—" అని కోపంగా అనేసి ప్రసాదరావు చరచరా వీధిలోకి నడిచాడు. సరిగా అదే సమయానికి ప్రక్క గదిలోనే వుండి యావత్తూ కాకపోయినా కొంత కొంత విన్న ప్రసాదరావు తల్లి యివలకు వస్తూ "ఇంకా కొంపలో అడుగుపెట్టి పదినిమిషాలు కాలేదు. ఏమిటి వాడి నల్లా వెర్రెక్కిస్తున్నారు? ఏదో మర్యాదగా వచ్చాం — నాల్రోజులుండి మర్యాదగా వెళ్ళాలని లేదా మీకు?"

"హుష్, వూరుకోవే—తగుదునంటూ వచ్చావు నడాన. నేను ధర్మం కోసం పాటుబడుతాను. ఎప్పుడు ఎక్కడెక్కడ ధర్మం నశిస్తుందో అక్కడల్లా పుట్టుకొస్తానని కృష్ణపరమాత్మ చెప్పలే గీతల్లో..."

"ఓహో - యిదే కామోసు ఆ అవతారం. చాల్లెండి. అనవసరంగా పిల్లల మనస్సులు నొచ్చుతాయి. వాళ్ళేం అజ్ఞానులు కారు. ఎవళ్ళ వాళ్ళంత వాళ్లు వాళ్ళయారు. మీరూరికే నోటికొచ్చినట్లల్లా..."

"నువ్వు ఫో—ముందు అవతలకి..." ముసలాయన గర్జించారు. మధ్యలో కోడలు వచ్చి- 'మావయ్యగారూ మీకు వోల్టీను తెచ్చేదా...' అని సమాధానంకోసం నిలబడ్డది.

"ఏవి మర్యాద? ఏవి మర్యాద? మూడు పిల్లలంటే అలా వుండాలి." ఆవిడకు వినిపించలేదు ఆ మాటలు. మళ్ళీ అందుకుంది.

"ఐతే మీరు ఏవిటి అమ్మాయిని - దాన్ని కాస్త పలకరించారూ?" ఆయన ముఖం కుంచించుకుని 'పోదూ—నీ తెలివికి సంతోషిస్తున్నాను. నేను ఆ విషయం ఎత్తితే అది చిన్నబుచ్చుకుని ఏడపదూ—'

ఇంతలో వోల్టీను పుచ్చుకునివచ్చిన కోడలును పరామర్శగా 'మీ అమ్మ అంతా బాగున్నారా? జాబు లొస్తున్నాయా?'

తల వూస్తూ కప్పును బల్లమీద వుంచి—'అత్తయ్యా...మీరు...' అంది. ఆవిడ అధికార పురస్సరమైన ధోరణిలో—'నాకేం అక్కర్లేదమ్మా. అబ్బ! అందులో ఏదో కోడిగుడ్డుసొన కూడా వేస్తారట. రామ! రామ! ఆ వోల్టీన్లూ అవీ అట్లాటి నూకరాలు ఒస్తీవాళ్లూ నాగరికులు మీకుగాని...'

ముసలాయన లేచారు. మీది సిల్కుకండువాని ఎక్కడ తగిలించ టమా అని యిటూ అటూ చూస్తున్న ఆయనకు ముసలావిడ మాటలు విని

పించాయి. చేతిలోని కండువాని అందుకోవటంకోసం వస్తూన్న కోడల్నుద్దేశించి—పద్యం చదివే ధోరణిలో 'రుచిపాకము నాలుకగా కెరుంగునే, తెడ్డది కూరలో కలియ' అని వూరికే అన్నాడూ భాస్కరశతక కర్త.

ఆ అమ్మాయి కండువా వంకీని తగల్చటంకోసం అక్కడనుంచి నిష్క్రమించాక ఆవిడ యీ అన్న ముక్కలకు వూరుకోలేదు.

"పిల్లదగ్గర అట్లా తీసిపారేస్తావస్తే నేనంటే యేమన్నా చీమకాలంత గౌరవం వాళ్లకిక ఎందుకుంటుంది ?"

"అందుకే అన్నానే వెర్రిదానా—మొగుడు తిడితే మొగసాలవాడూ తిట్టాడని."

"నాకు గౌరవం లేదని ఎల్లానూ తెలుసు. మీతో దేనికిగాని వాదన అమ్మాయి సంగతి కాస్త కనుక్కోండి మీరు వెళ్ళటమో, అతగాడికి కబురు చెయ్యటమో—"

"ఏమని-నువ్వు కాస్త నోరు మూసుకుంటే అన్నీ అవుతాయి. కాశీ నుంచి వచ్చేప్పుడు చూద్దాములే."

"దారిలో పనికదా ?"

ముసలాయన క్రుద్ధులై నిస్సారంగా—"ఇప్పుడు నావల్ల కాదు. వచ్చేప్పుడు చూద్దామన్నానుగా."

ఆవిడ ప్రక్కకు తిరిగి చెంగుతో కళ్ళు నొత్తుకుంటూ బొంగురు పోయిన గొంతుకతో 'అంతే దాని ఖర్మ. రేపు ప్రొద్దున్న నలుగురూ ఏవమ్మా మీ అమ్మాయి యింకా యిక్కడేవుందేమంటే నేనేమని చెప్పేది? నలుగురూ నన్ను దుయ్యబట్టుకుంటారు గాని...'

ఆయన ఒక్కమారు లేచి నిల్చొని-'చాల్చాలు యింక అధికప్రసంగం చెయ్యకు. ముందు నువ్వే మా అమ్మాయిని వొదిలేశాడని నలుగురిలోనూ చాటొచ్చేటట్లున్నావు.'

"హవ్వ ! రామ ! రామ !" అనేసి ఆవిడ నెమ్మదిగా అక్కడ్నుంచి నిష్క్రమించే లోపున ఆయన నున్నటి తలను పదే పదే రాసుకుంటూ పచార్లకు ప్రారంభించారు. దూరంగా నేలమీదకు గంటన్నర క్రితమే వదలి వేయబడ్డ మనువడు అక్కడే నిద్రతీసి అప్పుడే లేచి మెడను రిక్కించి

తాతగారి పచార్లను బుర్ర రాసుకోవటాన్ని పరిశీలనగా చూడసాగాడు. కాని అట్లా వాడు ఎంతోసేపు పెద్దమనిషి తరహా అభినయించలేడు. చరచరా మోకాళ్ళతో ప్రాకి ఆయన అప్పటివరకూ కూర్చున్న కుర్చీ ముందు ఉండే విరుగుడు చేవ గుండ్రబల్ల క్రిందకు చేరి, అంతక్రితము పసాదరావు నలిపి విసిరేసిన సిగరెట్టు పీకలను సునాయాసంగా ప్రోగుచేసి వాటితో ఆడుకోవటంలో నిమగ్నుడయాడు.

తాతగారు ఆలోచనామగ్నుడై ఇట్నుంచి అటూ అట్నుంచి ఇటూ ఓవల్టీను అరిగేదాకా పచార్లు చేశారుకాని బల్లక్రింద ఆడుకుంటున్న మనుమణ్ని పోల్చుకోలేకపోయారు.

ముసలావిడ వంటలోకి దిగింది. కోడలు బహుజాగ్రత్తతో మడికట్టుకుని ఆవిడకు అదీ యిదీ సరఫరా చేస్తున్నది. కాని యీ వ్యవహారంలో ఏమాత్రం హెచ్చుతగ్గులు వచ్చినా అత్తగారు సహించి వూరుకోదు—"నేను కాపురాని కొచ్చిన క్రొత్తలో..." అంటూ ప్రారంభిస్తుంది.

ఇదివరకే అంతమాత్రపు పని - సరస్వతి కిప్పుడు చేతినిండా తీరిక. గంటసేపు కూర్చుని తీరిగ్గా జడ అల్లుకున్నది. తరువాత తువ్వాలు సబ్బుబిళ్ళ పుచ్చుకుని స్నానాల గదిలోకి వెళ్ళింది. 'అయ్యో. యింత నిదానంగా పనులు చేసుకుంటూ కూర్చుంటే అవతల వంటా అదీ చూసుకోవాలి, ఇల్లు చక్కబెట్టుకోవాలి' అనటానికి యిది తన యిల్లుకాదు. ఈ పనులు పూర్తిచేసి సకాలంలో అందించవలసిన ఆ బాధ్యత, అదీ తనకు లేదు.

అది చాలా చిన్నగది. ఒక ప్రక్కంతా పొగతో నల్లగా మసిబారిపోయింది. క్రిందగా ఒక పెద్ద పొయ్యిలో భగభగా మండుతున్నవి నాలుగు పెద్దకట్టెలు. ఆపైన వెడల్పైన నల్లటి రాగిగాబు. అందులో రెండుబిందెల నీళ్లు ఏకధాటిన సలసలా మరుగుతాయి. కట్టెలు బాగా మండుతున్న వేమో, ఒకవైపునుంచి శగలు వస్తూండగా, సరస్వతి తలుపులు బిగించి, కుర్చీపీటను లాక్కుని, అందుమీద ఒక కాలుంచి పోసుకుంటూ నీళ్లు - మధ్యమధ్యను వొళ్ళు రుద్దుకున్నచోటే మళ్ళీ మళ్ళీ రుద్దుతూ గంటన్నరసేపు జలకమాడింది. అంతసేపూ తన వొళ్ళు తాను చూసుకుంటూనే వుంది. చేతులు నీళ్ళను పాళంగా తోలుపుతూనే వున్నాయి. స్నానం పూర్తవుతూనే వుంది. కాని

కుమస్సు మనస్సులో లేదు. ఇప్పుడు తన బ్రతుకు పరీక్ష తప్పిన కుర్రవాడి మోస్తరయింది.

అంత వేడినీరు శరీరంమీదుగా పరుగెడుతున్నప్పుడు సరస్వతికి తన కాపురం మొదటి దినాలు గుర్తుకొచ్చాయి. ఆ ఆలోచనలుగూడా 'సంబంధపు చర్యలు—' అట్నుంచి 'పెండ్లిచూపులు'—'బీదా గొప్పా తారతమ్య వివరణ'—పలువురూ పలువిధాలుగా చేసిన సూచనలు, ఎల్లాగో అయిన పెండ్లి, మధుపర్కాలు, దండాడింపు అన్నీ చకచకా తిరిగిపోయాయి.

అటుతరువాత శాస్త్రినిగురించి తియ్యగా వూహించటానికి మొదలు పెట్టిన రోజునుంచి, 'అతడ్ని చూడగానే ఎవరో వెనుకనుంచి వచ్చి గిలిగింతలు పెట్టినంత వుత్సాహంతో పులకలెత్తిన తను - ఏ రోజుకోసం యువతీ యువకులు రాత్రిళ్ళూ పగళ్ళూ వువ్విళ్లూరుతూ ఆలోచిస్తూంటారో, ఆ దినం - తను ఎట్లా వర్తించింది? ఏమేమి చేసింది ఒక్కమాటు గుర్తుకు తెచ్చుకోకుండా వుండలేకపోయింది సరస్వతి.

సరస్వతి కప్పటికి యింకా పదహారేళ్లు నిండలేదు. వోణీలు మానేసి కూడా ఏడాది పూర్తయిందో లేదో—యింటికి వచ్చిన అమ్మలక్కలంతా 'పిల్ల ఎత్తరి—మనిషవుతుంది.' అంటూంటే ఆ ముక్కలు బోధపడక పోయినా వాటివెనుక ఏదో తీయటికల వున్నట్లు అనిపించేది తన మటుక్కు. ఆ రోజుల్లో ఎంతసేపూ దృష్టి ముస్తాబుమీదే వుండేది.

పండగలకు పిల్చినప్పుడల్లా శాస్త్రి వస్తూండేవాడు. మొదటిసారి చెల్లెల్నికూడా వెంటబెట్టుకొస్తే, ఆ పిల్లను తాను ఎంత వేళాకోళం చేసింది—ఏదో వంకను ఆమె బట్టలనో అలవాట్లనో హేళనగా తీసికట్టుగా విమర్శించినదీ, అవన్నీ గుర్తుకొస్తున్నకొద్దీ సరస్వతి యిప్పుడు విచారించకుండా వుండలేకపోతున్నది. ఒక్కలేని తనాన్ని మాత్రమే శాస్త్రి తమ యెదుట విధిలేక ప్రదర్శించవలసివచ్చినపుడు అతను బికారిలా వుంటాడని, మావగారివద్దనుంచ్చి వచినప్పుడల్లా డబ్బు గుంజుకుపోవటమే ప్రధానాశయంగా పెట్టుకున్నాడని తనవారు ఆఖరికి తల్లికూడా ఆ నోటా ఆ నోటా తనముందరే అంటూ వచ్చినప్పుడు అభిమానవతియైన మరొక స్త్రీ యేం చేసేది? తనుమాత్రం యివతలిగట్టునే నిలబడి చేతుల్ని కట్టుకుని నలుగురూ తిరస్కారంగా అనుకునే మాటలకు వూతాన్ని యిస్తూ ఎంత ముభావం

పట్టించలేదు ? ఆ రోజున అమ్మలక్కలు తాంబూలాలు తీసుకున్నాక కొంగున కొంగు ముడివెయ్యలేదని, అంతమాత్రం లేకపోయిందా అన్న భాగంతోనే తెల్లవార్లూ తలుపు నానుకునే నిలబడి పెడముఖంగా వుంటే అతనేమన్నాడు ? పల్లెత్తుమాట అనకుండా గుప్ చుప్ గా మూడురోజులూ పైకులో కూర్చున్నట్లు గడిపి మళ్ళీ వచ్చాక తీసుకువెళ్తానని అనేసి దాటుకున్నాడు తన బారినుంచి. ఆవతలవాళ్ళు తీసుకెళ్ళటం కోసం మనిషిని పంపినప్పుడు కూడా యేడ్చి యమలోకానికి పోతున్నదానిలా పెద్ద పెద్ద రాగాలతో వెళ్ళినప్పుడు స్టేషనులో అతను ఎదురువచ్చి ఎంతో మర్యాదగా యింటికి తీసుకువెళ్ళాక కూడా మూడు నెలలు తను ఎన్ని చెరువుల నీళ్ళు త్రాగించినా పైకి ఏమన్నా తేలాడా ! అటువంటి శాస్త్రిని తిరిగి నలుగురూ కోతి అంటూండటాన్ని తను యీ మాత్రం పరిజ్ఞానం వచ్చాక కూడా వింటూ సహించి ఎంతకాలం ఎట్లా ఊరుకోగలదు ? ఇప్పుడు పిచ్చివాడు కూడా అవుతాడేమోనని చెల్లాయి వ్రాసింది. ఎవరు కారణం ? తనే. తనే. తనే. తన మూలకంగా అతడు సర్వనాశనమౌతాడు. డేగిసాలోని నీళ్లన్నీ కర్చయాక యివతలకు వచ్చిన కూతుర్ని ఉద్దేశించి-"ఎక్కడున్నావేఁ ఇంత సేపూ స్నానమేనా..." అన్నది తల్లి.

"ఆఁ" అనేసి గడప దాటుతుండగా చంటివాడు ఆడుకుని వదిలేసిన గిలక్కాయి ఎర్రగా దృష్టిని పడ్డంతో సరస్వతికి ఒక్కమాటు వొళ్ళు ఝల్లుమంది. "పిల్లవాడు ఏమైనట్లు ?"

చిన్న గుడ్డతోనే నాలుగు గదులూ అలంగం తిరిగి వంట యింట్లోని వదినగారి వద్దకు వచ్చి తడబడుతూన్న గొంతుకతో "నానిగాడేడి ?" అంది.

ఆవిడ చెంబును క్రింద ఉంచుతూ "వాకిట్లో లేడా—ఇందాక చూశానే !"

"ఏమోనమ్మా...!" అంటూ మళ్ళీ వొడ్డంతా కలయతిరిగింది.

పొయ్యిదగ్గర కూర్చుని సంతనాగా వండుతున్న ముసలావిడ పోపు కోసం మాడబెట్టిన బాణల్ని యిటుక ముక్కలతో గమ్మున దింపి 'అయ్యో నా కూతురా-ఎక్కడ వదిలేశావ్రా బిడ్డను - చప్పున వెతకండి. చప్పున వెతకండి' అంటూ ముందరగా నూతి దగ్గరకు పరుగెత్తింది. తల్లి నూతి దగ్గ

రకు దారితియ్యటంతో బెంబేలుపడి సరస్వతి గుడ్లనీరు గ్రుక్కుకుంటూ అనుసరించ సాగింది.

'ఆశ్చర్యంగా ఉందే!' అంటూ వదినగారు ఇల్లంతా చుట్టివచ్చి అంత క్రితమే పచార్లను ముగించి మధ్యగదిలో నరసారావుపేట కుర్చీలో పడుండి అర్థనిమీలిత నేత్రాలతో ఆలోచిస్తూన్న ముసలాయన్ను అడిగింది. 'పిల్ల వాడ్ని ఎక్కడన్నా చూశారా?' అంటూ.

ఆయన హఠాత్తుగా విన్నారేమో ఆ లేవటంలో టప్పుమని ముక్కు మీదనుంచి కళ్ళజోడు జారి గచ్చుమీదపడి బ్రద్దలయింది. కోడలు ఆ ముక్కల్ని ఏరటం కోసం నేలను వంగినప్పుడు టీపాయి క్రిందచేరి ఆడుకుని అలసి నిద్రపోతున్న పిల్లకుంక ఒక మూలను సాక్షాత్కరించాడు.

"ఇదుగోనర్రా యిక్కడున్నాడు—"

గుమ్మందాకా నడిచి ఎండలోకి గాబరాగా చూస్తున్న ముసలాయన 'యేడి యేడి' అంటూ వచ్చి 'అమ్మ దొంగా, ఇందాక నేనే అబ్బాయితో మాట్లాడుతూ మాట్లాడుతూ నేలకు వదిలేస్తే దీని క్రిందకు జేరాడు గావును' అని పూర్తి చేశారు.

ఎరుపెక్కి ధారలు గట్టిన కన్నీళ్ళతో తడిసిన సరస్వతి ముఖాన్ని చూడగానే తండ్రి హృదయం చప్పున కరిగి 'ఇదుగోనమ్మా' అంటూ అందిచ్చిన చేతుల్తో తలమీద నెమ్మదిగా నిమిరి 'ఎంత గాభరా పెట్టేశాడో ఇంటిల్లపాదినీ వీడు. అమ్మ ముండా! కళ్ళజోడు కూడా విరిగిందిరా నీ మూలాన.'

మాటలో అడ్డువస్తూ అమమ్మ-"ముండా గిండా అనకండి వాడిని— వాడికి మీ పేరే పెట్టారు కూడా."

సరస్వతి చెంగుతో నీళ్ళు వొత్తుకుంటూ పిల్లవాడ్ని తీసుకుని వెళ్ళ బోతోంది. గొంతు సవరించుకుని. అన్నారు తండ్రి—"ఏమే అమ్మాయీ మాతో కాశీ వస్తావా?-యాత్రలు చేసొద్దుగాని."

మడిలోవున్న పెద్దావిడ నోరు నొక్కుకుంటూ—'దాన్నెందుకండి కాశీ ప్రయాణం చేస్తారు?' అంటూ అడ్డుపుల్ల విసిరింది.

"అది కాదే భడవా - ఏమన్నా పాపాలు చేసుంటే అవన్నీ గంగలో కడిగేసుకుంటానికి."

"అది కుర్రపిల్ల-దానివల్ల ఏమే పాపాలు జరిగుంటాయని—"

"ఏమే పాపాలా - మొగుళ్ళను యేడిపిస్తే వచ్చే పాపాలు."

"చాల్లెండి ఎవరైనా వింటే నవ్విపోతారు?"

"అయ్యో ఖర్మమా—అస్తమానూ ఎవరో వింటారు. ఎవరో ఏదో అంటారు అని ఎవరికోసమో బ్రతుకుతున్నట్లు అఘోరిస్తావేమిటి? మీ ఆడ జాతి చేసే ఘోరాల్లో భర్తలను క్షోభపెట్టి అలోలక్షణా అనేట్లు చెయ్యటం వుందే—దానికోసం కాశీ వెళ్తే జీవితంలో ఒకమాటు మంచిదంటాను నేను."

"మరి మీరెందుకు అయితే—"

"అల్లా అడుగు లెక్క చెబుతాను. మీరు చేసే దరిద్రగొట్టు పనులన్నిటికీ చిత్రగుప్తుడిదగ్గర జవాబుదారీ వహించేది మేము. అంటే మేం చేసుకున్న పుణ్యమేదన్నా వుంటే అది కాస్తా మీ మూలంగా బ్యాంకులో డబ్బులాగా హరించిపోకుండా వుండేందుకు."

"అయ్యో బాబో—మీరు దేముడితో కూడా గీచి గీచి బేరమాడేటట్లున్నారు పాపపుణ్యాల విషయంలో."

"బేరమా—నా ఎదురుగుండా వచ్చి నిలబడితే భగవంతుడ్ని కూడా లెక్కల్లోకి గుణింతాల్లోకి దింపి చివరకు కొసరు వేయించుకుంటాను. రాధేశ్యామ్. రాధేశ్యామ్. వెళ్ళండి వెళ్ళండి. నా కళ్ళడోదు ఆయువు మట్టం కావటానికొచ్చింది యీ హడావిడి. లేకపోతే నిక్షేపంలా యింట్లో వున్న బిడ్డడికోసం—ఒకరు వీధిలోకి ఒకరు నూతిలోకీ పరుగులుచ్చుకున్నారు. ఛీ! ఛీ!"

సరస్వతి యీ సందట్లో నెమ్మదిగా జారుకుని మరోచీర మార్చి పిల్లడికి పాలు గట్రాపట్టి చాపపర్చుకుని నెమ్మదిగా చిన్నకునుకు తీయటానికారంభించింది. అ పసివెధవ కాళ్ళను తపాతపా కొడుతూ కేకలు పెడుతూ కేరింతలు కొడుతున్నాడు.

ఆ రోజు రాత్రి ఉన్నట్లుండి సరస్వతి హఠాత్తుగా ఒక నిర్ణయానికొచ్చేసింది. తెల్లవారి లేచాక ఎందరు చెప్పినా వినలేదు. ఎదురు మాట

లాడినవారందరితో చెడామడా తగూలాడేసింది. ప్రసాదరావు అధికారం కూడా పనిచెయ్యలేదు. బలవంతాన తండ్రిజేబులోని పర్సు లాక్కుని పది రూపాయలు చేత్తోపుచ్చుకుని నేనివ్వాళే వెళ్తానని మంకుపట్టుపట్టి ప్రయాణ మయింది. ముసలాయన తప్పనిసరిగా స్టేషనుకు వెళ్ళి టికట్టు కొనియిచ్చి వచ్చారు. ఆ రాత్రి వదిన 'నేను చెప్పానా మీ చెల్లెలు కోతి—' అని భర్తను గేలిచేసింది నవ్వుతూ.

*

సాయంత్రం ఎర్రబడ్డది. సరస్వతి ముఖానకూడా, కాలే చెమట లకు అలుముకుపోయిన కుంకుమరక్తిమను, చూసి కూడా చూడనట్లు తప్పుకు నిల్చున్నాడు శాస్త్రి.

మళ్లీ సజ్జబుట్ట—మరచెంబు, ప్లాస్కు, ట్రంకుపెట్టి ఒకటొక్కటే రిక్షావాలా తెచ్చి యింట్లో పడేస్తున్నాడు.

వెలిగిస్తున్న బుడ్డిదీపాన్ని గోడనున్న మేకుకు చేర్చి మసకచీకటిలో 'ఎవరన్నయ్యా—' అంటూ వచ్చింది చెల్లాయి.

క్షణంసేపు మాటలాడకుండా చూస్తూ నిలబడ్డ మానవాకారం నిశ్శబ్దంగా అక్కడనుంచి నిష్క్రమించింది.

సరస్వతి పోల్చుకోలేక పోలేదు. బికారిలా పెంచిన గడ్డంతో నల్లటి మురికితుండు నొకదాన్ని చుట్టుకుని స్తంభంవారనుంచి మిడిగుడ్లు పెట్టుకుని చూస్తున్నది ఆ మనిషే—అతగాడేనని.

సరస్వతి చంకనుండి పసికుంక నేలకు జారబోతున్నాడు. చెల్లాయి చప్పున అందుకుంటూ '—నువ్వా వదినా-యిల్లు ఎట్లా పోల్చుకున్నావు?'

సరస్వతి కొంగునున్న ముడిప్పి మూడుపావలా కాసులు యివ్వ బోయింది. రిక్షావాడు తలను పంకిస్తూ 'ఏం దమ్మగోరూ—ఆయీాది కాదని యీా యీాది, యీా యీాది కాదని అది వూరు సంగానికి తిప్పిస్తివే—ముప్పా వులా డబ్బులేనా, రూపాయన్నర బేరం. నా నుచ్చుగోనంటే వుచ్చుగోను.'

సరస్వతి నీరసంగా—'అంతే—నా దగ్గర అంతకన్నా లేదు. వెళ్లు వెళ్లు. ఇచ్చిన డబ్బులతో తృప్తిలేకపోయాక, అందుకనే మీకు కూడూ గుడ్డా వుండదు.'

ఇచ్చిన ముప్పావులాను గడపమీద వుంచి—'అమ్మగోరూ—నా కాడ తిరకాసు పనికిరాదండీ, మీ డబ్బులు మీరు యిచ్చేస్తేనే సంగోరు దక్కుతుంది.'

అంతసేపూ కావడి బుజాన్నేసుకుని సందు మార్గాన నీళ్ళను తెచ్చి జేరవేస్తున్న శాస్త్రి ఎదురు రొమ్ము ముచ్చెమటలు కారుతూండగా కావడి బద్దను పుచ్చుకుని నేలను పొడుచుకుంటూ 'ఎవరి సంగోరురా దక్కేంది ?' అని పళ్లు పటపటా పిండి ఉరిమినట్లు చూశాడు. అంతవరకు యింట్లో మగ వాళ్లు కూడా ఉన్నారనే జ్ఞానంలేని రిక్షావాలా 'ఇసుమంటి బేరాలు నొందు తగిల్తే నోజుకి నా సామిరంగా ! గంజిమెతుకులు కూడా పోవు నోపలికి' అని నెమ్మదిగా తోక ముడిచాడు.

"ఇదిగో మంచినీళ్లు వదినా."

సరస్వతి గుటగుటా రెండు చెంబుల్నెత్తి నోట్లో పోసుకుని—

"అమ్మయ్యా" అనుకున్నాక "ఇప్పుడు నీ వంట్లో ఎట్లాగుంది ?"

"ఫరవాలేదు. ఇంటికి వెళ్ళమన్నారు. శుక్రవారం శుక్రవారం రిక్షా మీద వెళ్ళి యింజక్షన్లు తీసుకొంటున్నాను."

చెల్లాయి చంకలోని కుర్రకుంక నెమ్మదిగా బొకాపట్టి యేడుపు లంకించుకున్నాడు.

"పాలు కలపాలి కామోసు వీడికి–"

"ఆఁ యిందాక రైల్లో యివ్వటమే మళ్ళీ పట్టలేదు."

"ఆ బుట్టలో వున్నాయా పాలడబ్బా—సీసా అవీను..."

"ఆ... నేనిస్తాన్లే. నువ్వెందుకు లేవటం."

"పాపం యేడుస్తున్నాడొదినా—"

"ఏడవనీ వెధవేడుపు..."

"వేడినీళ్లు కావాలి కాబోలు. కుంపటి అంటించనా."

"నాకు చెప్పు. నేనే అన్నీ చూసుకుంటా. నీకు తెలీదమ్మా నీకు కూడా వరసాగ్గా పిల్లలు కలిగితే...యిట్లాటివన్నీ—అప్పుడు అలవాటవు తాయి."

"ఫో—వదినా. సరదాకు పిల్లడికి పాలుపడతానంటే—"

"అదే—మొదట్లో సరదా, ఆ తరువాత బురద...యిందులోంచి పీక్కుందామన్నా తెరిపి వుండదు చూడ్డంలే..."

చెల్లాయి లేచి బొగ్గులు కుంపటి చేర్చి నిప్పు వెలిగిస్తూ!

"చాలా చిక్కావే వదినా..."

సరస్వతి తనదగ్గర పాలు కలుపుతున్నది నెమ్మదిగా తలెత్తి "ఏదో నువ్వైనా అడిగావు ఆ మాత్రం—అందుకే సంతోషిస్తున్నా."

చెల్లాయి 'అన్నయ్య వస్తున్నాడు...' అని గొంతు కుంచించి—

"ఈ యిల్లు నీ కెట్లా తెలిసింది చెప్పు—ఇంత మూల డాబా గార్డెను లోంచి చెంగ్రలావు పేటకు వచ్చేశావేం—!"

"నోట్లో నాలికుంటే అన్నీ తెలుస్తాయి. నాకేం సిగ్గు-మొహమాటం బిడియం లేవు. ఇదివరకేమన్నా వుంటే ఆ కాస్తా యిప్పుడు హరించుకు పోయాయి. ఎవర్నన్నా అడగ్గలను, ఏ విధంగానన్నా యీ యిల్లు పట్టుకో గల్ను అనుకున్నాను. అంతే."

"పోనీలే—ఎల్లా వుంది?"

సరస్వతి నాలుగుమూలలా పరిశీలనగా చూసింది. అది మునుపటి వాటాకన్నా చిన్న—(అద్దె భరించలేక కాబోలు) గూభ్యంలా మూసుకు పోయి నేలబారున వుంది. గాలీ వెలుతురూ తక్కువ. ఇహ లోపల, ఎక్కడ సామాను అక్కడే—నానాచిందరగానూ వుంది. గుమ్మం ఎదురు గుండా పెద్దవేపచెట్టు. నిత్యమూ బోలెడు రొట్టరాల్తుంది. దారివెంట బస్సులు బళ్లూ మనుష్యుల కాలిదుమ్మూ అంతా యీ యింట్లోనే వుంటుంది.

సరస్వతి లేచి దొడ్లోకి వెళ్ళింది అక్కడ ఎల్లా వుందో చూదామని. అటువైపు నొక పెద్ద బాదంచెట్టు.

అప్పుడే మెరుపు మెరిసినట్లు తన అన్నగారి యింట్లోని సౌకర్యాలు, అన్ని హంగులూ, విరుగుడు చావ టీపాయి దగ్గర్నుంచి ఫిలిప్సు రేడియో పెట్టేవరకు జ్ఞాపకం వచ్చాయి.

మరైతే అక్కడే ఎందుకు వుండలేదు? ఇక్కడికి యీ ఎత్తుపల్లాలు గతుకుల్లోకి దేనికిగాను తిరిగి వచ్చింది?

సుఖాన్ని కాని దుఃఖాన్ని కాని కలిగించేది-పొందేది మనస్సు. ప్రాపంచికమైన యీ వస్తువుల్నుండి వచ్చేవి అనుభూతులే—ఫిలిప్స్ రేడియో సెట్టు, వాక్సుహాలు చిన్నకారు, నాలుగంతస్థుల మేడ—మనుషులు కోరదగ్గవే - కాని పూరికొంప యింటినిండా దుమ్ము గతుకులు పల్లాలు, ఒకటి వుంటే ఇంకొకటిలేని సంసారం-యిందులోనే గడుపుకుంటూకూడా మనస్సు దివ్యమైన అనుభూతుల్ని రుచిచూడగలదు. మనుష్యుల్ని వాళ్ల సంస్కారము మనస్సుయొక్క అంతస్థుల్ని బట్టిగాని కొలిచేది, బ్యాంకు ప్యాసుబుక్కు బాలెన్సునుంచి కాదు. లోకం అనుకునేట్లు ఉత్తమ తరగతి జీవితం ఉన్నత భోగాల్ననుభవించటమే ఐతే-సరస్వతి నిష్కారణంగా నిలుచున్న పాళాన ఎందుకు విశాఖపట్నం ప్రయాణం కడ్తుంది? ఏదివున్నా యేదిలేకపోయినా 'నాది' అని చెప్పుకునే హక్కుకోసం ఆడ-మగా పోరాడ్డాన్ని బట్టిచూస్తే స్వేచ్ఛకోసం స్వాతంత్ర్యంకోసం అన్ని రంగాల్లోనూ పెనుగులాట సాగించటం ఎంత సహజమో చప్పున తెలుస్తుంది.

సరస్వతి ఏమీ పులుక్కుండా పలుక్కుండా ఆ దొడ్డిగుమ్మాన్నానుకుని అట్లా ఎంతసేపో నిల్చుండిపోయింది.

పిల్లడికి పాలుపడుతూన్న చెల్లాయి అన్నయ్యతో మాటాడుతున్నది కాబోలు అని అనుకుని తృప్తిపడసాగింది. గుంటవెధవ 'తా...త్త...త్త...త్తా...త్తా...' అని చేతుల్ని తడుస్తూ గచ్చుమీద దీపంవైపుకు వురుకుతున్నాడు హడావిడిగా.

అంతసేపూ సరస్వతి చూడలేదుగాని బాదంచెట్టుక్రింద రాతిమీద కూర్చుని చిన్నమాసిన కొళ్ళాయి గుడ్డతో శాస్త్రి ఏదో ఆలోచిస్తున్నాడు.

ఆకాశంలో అంతకుముందు గుంపులు గుంపులుగా చేరిన నీలిరంగు మబ్బుల మధ్యనుంచి త్రోవను చీల్చుకుంటూ చందమామ పైకి పైకి వస్తున్నాడు. ఆ వెన్నెల ఒక్కమాటు విచ్చినట్లయింది. బాదంచెట్టు కొమ్మల మధ్యనుంచి శాస్త్రి వీపుమీదకూడా వెన్నెల పడుతోంది. పగల్లా ఎండలకు మాడివున్న నేల నెమ్మదిగా చల్లబడుతోంది. బాదంచెట్టు క్రిందనుంచి

చూస్తే పచ్చని శరీరం- తెల్లటి నీలిరంగు అంచుల చీరతో గుమ్మంవద్ద నిలబడ్డ సరస్వతి చాలా మనోహరంగా అగపడొచ్చు.

హఠాత్తుగా ఆమె దృష్టి శాస్త్రిమీద పడ్డది. తక్షణం చెట్టు నీడకు నెమ్మదిగా అడుగులేసుకుంటూ విని వినిపించకుండా అంది—"ఇక్కడ కూర్చుని వొక్కరూ ఏంచేస్తున్నారు?"

"అదంతా నామీద కోపమేనా... ?"

ఒకటి రెండు బాదంకాయలు పుటుక్కున విరిగి నేలకుపడ్డ శబ్దం వినా అతడి వద్దనుండి సమాధానం లేదు.

వెనకనే నిల్చున్న సరస్వతి - కఠినంగా, "నే నసలు అన్నింటికీ తెగించి వచ్చాను. నా దగ్గర మంచితనం లేదు. అనవలసిన వేమైనా వుంటే నా ముఖాన్నే అనెయ్యండి. అంతేకాని..."

శాస్త్రి మోకాలు క్రిందకుదింపి 'హుఁ' అని మూలిగాడు.

"అన్నట్లు చెల్లాయి వుత్తరం వ్రాసింది. మీరు కోతిని వుంచుకుని దానికి నా పేరు పెట్టారని..."

శాస్త్రి చప్పున అక్కడ్నుంచి లేచి వెళ్ళిపోబోయాడు. అతని ఎడమ చేతిని చప్పున అందుకుని వెనక్కు లాగుతూ—

"ఆ వ్యవహారమంతా నలుగురినోట్లోనూ పడింది. మీకేమో మతి చలించిందని... నా కొక్కదానికే తెలుసు, ఈ తంతంతా ఎందుకు జరిపిస్తున్నారో."

చేతిని గట్టిగా విదల్చి శాస్త్రి లోపలికి దూసుకున్నాడు. చప్పున సరస్వతి బిక్క మొహంపెట్టి రెండుచేతుల్తో ముఖం కప్పుకుని వెక్కి వెక్కి యేడువ నారంభించింది. బాదంచెట్టుమీద కాకి ఒంటికాలుమీద కునుకుతూ హఠాత్తుగా లేచి 'కా...కా' అని అరవటంతో, సరస్వతి యేడుపు మాని గూడుమీదకు ప్రాకబోతున్న గండుపిల్లిని చూసి రాయితీసుకుని వేసింది. అంతే...మళ్ళీ యిదివరకు శాస్త్రి కూర్చున్న చోటే కూలబడి మోకాలుమీద ఆన్చిన తలతో ఆలోచిస్తూ యేడుస్తూ కాలక్షేపం చేయసాగింది.

చెల్లాయి కొంతసేపటికి వెతుక్కుంటూ వచ్చి "ఏమిటిక్కడ... ఎందుకు ఏడుస్తున్నావు వదినా..." అంటూ భుజంమీద చేయివేసి కుదిపింది.

అంతక్రితమే మబ్బుల్లోకి వెళ్ళిన చందమామ మళ్ళీ యివతలకొచ్చి తొంగి తొంగి చూస్తున్నాడు.

"నాకు చెప్పవు వదినా... నే నన్నయ్యను పిలుచుకొస్తానుండు" అని వెళ్ళి నులకమంచం పక్కలో వూగుతూ అర్ధనిమీలిత నేత్రాలతో గతించిన మర్కట సుందరిని తల్చుకుంటూ పరున్న శాస్త్రి నుద్దేశించి,

"అన్నయ్యా వదిన యేమంటోంది?" అన్నది చేతులు నలుపుకుంటూ.

"ఏ వదిన..." అంటూ అయోమయంగా ప్రశ్నించాడు.

ఈ మారు చెల్లాయి కూడా సరస్వతి పక్షం తీసుకోక తప్పింది కాదు.

"వదినంటే—ఆ డాబా యింట్లో ఆనాళ మేడమీద ఎలక్ట్రికుతీగను ముట్టుకుని చనిపోయిన కోతే ననా నీ అభిప్రాయం."

"అంతే...అసలైన వదిన ఎప్పుడో యిక్కడ్నుంచి వెళ్ళిపోయింది."

"లే అన్నయ్యా. నువ్వు ఒక్కమాటు వచ్చి చెబితే వదిన తప్పకుండా వచ్చి అన్నం తింటుంది."

శాస్త్రి మూర్ఖంగా "నావల్ల కాదు..." అనేశాడు.

చెల్లాయి వెంటనే దొడ్లోకి పరుగెత్తి తెగించి ఆడదల్చుకున్న అసత్యం వొదిన ఎదుటను పెట్టింది.

"అన్నయ్య పిలుస్తున్నాడు నిన్ను—"

సరస్వతి మోకాళ్ళమీద ఆన్చిన తలనెత్తి "నన్నా..."

గుండెలు కొట్టుకుంటుంటే చెల్లాయి "అవును. నిన్నే..." అని చీకట్లోకి ముఖం త్రిప్పుకుంది.

ఆ అమాయకురాలు యీ మాటలను నమ్మేసి చెంగుతో ముఖం తుడుచుకొని నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ పడకగది చేరింది.

దాన్ని పడకగది అని అనటంకంటే కలకత్తా చీకటికొట్టు అనటం యుక్తమనిపించుగొంటుంది.

గదినిండా డబ్బాలు—నా నా చెత్తాను మధ్యగా నులక మంచంలో శాస్త్రి మాగన్ను మీదున్నాడు. సరస్వతి ఒక అడుగు ముందుకు వేసి గడ

పను దాటిందో లేదో అవతలివైపు కిటికీదగ్గర వూపిరి బిగపట్టుకుని నిలుచున్న చెల్లాయికి యీ క్రింది మాటలు వినిపించాయి.

సరస్వతి—'పిలిచారట—'

నిశ్శబ్దం.

"మిమ్మల్నే—ఎందుకని అడుగుతున్నాను."

"నువ్వు నిలువు నిలువంతా అబద్ధాలకోరువి. నీ అంతట నువ్వు వచ్చి నేను పిలిపించానని దబాయిస్తున్నావు."

"పిలవలేదూ—చెల్లాయి వచ్చి చెప్పింది మీరు పిలిచారని."

"ఇది ఇంకో అబద్ధం—"

"సరే—నేనన్నీ అబద్ధాలే ఆడుతాను. మీరింకా ఎందుకు నన్నిట్లా యేడిపిస్తారు?" శాస్త్రి మాటలు వినిపించలేదు. సరస్వతి గొంతుకే తెచ్చుకున్న వుద్రేకంతో—"కానివ్వండి. మగ మహారాజులు. మీ యిష్టమొచ్చినన్ని ఆటలు మీరు ఆడవచ్చు. ఎల్లా ఏడిపించ దల్చుకుంటే అల్లా యేడిపించండి" మళ్ళీ గొంతుకలో వొణుకు—దుఃఖంతో మిళితమైన మాటలు వెంట వెంటనే దొర్లాయి-"నేను మొండిపీనుగను. మీరు వెళ్ళమన్నా వెళ్ళను. ఇదే నా యిల్లు...యిక్కడ్నుంచి నన్ను ఎక్కడికీ ఎవళ్ళూ వెళ్ళగొట్టలేరు. మీరు నాతో మాట్లాడక పోయినా నేను యిందులోనే వుంటాను. ఆఖరికి మీ చేతుల్లో ఏ రోజో మీరే యీ నా కాస్త గొంతూ—"

శాస్త్రి వున్నమాటున చెళ్లుమని చెంప పెట్టులా తగిలిన మాటలకు వులిక్కిపడి లేస్తూ—గోడను వ్రేలాడుతున్న దీపంబుడ్డి వత్తి పెద్దదిచేసి చేత్తో పట్టుకుని సరస్వతి ముఖాన ధారలుగట్టి స్రవిస్తూన్న కన్నీటి దొంతరులను వింతగా చూస్తూ—"నీ హృదయం రాయిలా పాషాణమనుకున్నాను. కాని యింత బేలవనుకోలేదు" అని పకపకా నవ్వాడు. ఒక్కమాటు దించిన తలను కాస్త యెత్తి కోపంగానే అన్నది—"నేను అలోలక్షణా అని యేడుస్తూంటే మీకు హాయిగా కడుపునిండుగా వున్నట్లుందే—"

"అవును".

"అల్లాగే వుంటుంది లెండి, గుమ్మంలోకి అడుగు పెట్టే చేసుకున్న దాన్ని కదా ఏమని నోటినుంచి మాట పెగిలిందా మీకు? ముత్యాలు రాలి పోతాయనుకున్నారు."

"అంతే—ముత్యాలు రాలిపోతా యనుకున్నాను."

"పోనీ—కన్న పిల్లావాడినన్నా దగ్గరకు తీశారూ?"

"వాడూ నీ పిల్లాడేగా..."

"అదీ...కోతుల్లో ప్రేమలు వెలిగించే ముఖాలకు అంతకన్నా ఏమిటి తెలుస్తుంది."

"కోతులే నయమంటాను నేను మనుషుల కన్నా. ఒక పొరపాటు చేశాడు భగవంతుడు. అందరికీ తోకలు లేకుండా మనుషుల్ని చేసేశాడు కాని, కొంత కొంతమందికి—ఆ స్వభావం కలవాళ్ళకు, తేలిగ్గా పోల్చు కునేందుకు వీలయ్యేటట్లు తోకలువుంచితేనే బాగుండిపోయేది!"

"ఏ యే స్వభావం కలవాళ్ళకు?"

"అదే—నీకుమల్లే, చీటికీ మాటికీ తగూలాడి తెగించి పుట్టింళ్ళకు మాకేమని పోతూంటారే..."

"మాటలు తిన్నగా రానీయండి."

"ఏం! యీమాటు చీపురుకట్ట తిరగేస్తావా?"

"ఆ ముక్క ముందుగా మీ నోటినుంచే వచ్చింది. నే నన్లేదు. మీరు వెళ్ళమంటేనే వెళ్ళాను."

"మళ్ళీ ఎందుకొచ్చావు? ఏ ముఖం పెట్టుకుని?"

"మీకు ఆ వెళ్ళమనే అధికారం లేదని తెలుసుకున్నాక వచ్చేశాను."

తరువాత శాస్త్రి నవ్వు వినపడ్డది. మళ్ళీ మాటలు - "నువ్వు ఈమారు రెండాకు లెక్కువ చదువుకొచ్చి నట్లున్నావు. యిస్కీమంటే యిస్కీ మంటున్నావు."

"మీరు మాత్రం-కోతుల్లో కాపురం వెలిగించి రాలేదూ—" శాస్త్రికి మిసెస్సు జ్ఞాపకాని కొచ్చింది. నెమ్మదిగా అనదల్చుకున్న మాట పైకనే శాడు. "చెల్లాయిని రేపువారం యిక్కణ్నుంచి తోలేస్తాను."

సరస్వతి "మీ కాళ్ళు పట్టుకుంటాను-ఆ ముక్క మళ్ళీ అనకండి." శాస్త్రి నవ్వి "నీ ధోరణి చూస్తూంటే అంతా కోతిచేష్టలకు మల్లే అనిపిస్తోంది. వెళ్ళేముందు తెచ్చినందుకు తగూలాడావు. ఇప్పుడు పంపిస్తానంటూంటే యిట్నుంచి మళ్ళీ వద్దంటున్నావు. ఏమిటి?" సరస్వతి గోడను జారగిలబడి "మీరు ఒక్కమాటు గాదు, వెయ్యిమాట్లు గాదు, లక్షసార్లు అనండి. నేను కోతినే—కోతినే—కోతినే—" అని ఫక్కుమని నవ్వేసింది.

—....—